RNI No.: TELTEL2015/62825

తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 183 | శనివారం, 25 జనవరి, 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

ఆపరేషన్ కగార్ ఆపివేయాలి

– ప్రొఫెసర్ హరగోపాల్

హైదరాబాద్, తెలంగాణ సేన: ఆపరేషన్ కగార్ ను వెంటనే ఆపివేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. పౌర హక్కుల సంఘం, మానవ హక్కుల వేదిక,ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ, పౌర హక్కుల పరిరక్షణ కమిటీ పౌర హక్కుల పర్యవేక్షణ కమిటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. చత్తీస్ ఘడ్ రాష్ట్రంలో ఉన్న కోట్లాది విలువైన వనరులను బహుళ జాతి కంపెనీలకు, కార్పొరేట్లకు దోచిపెట్టడం కోసం భారత ప్రభుత్వం దేశ మూలావాసులైన ఆదివాసీలపై అతి క్రూరంగా మారణకాండను కొనసాగిస్తూనే అదే విధంగా వారికి మద్దతుగా ఉద్యమిస్తున్న ఉద్యమకారులు కూడా అత్యంత కిరాతకంగా హత్య చేస్తూ దానికి ఆపరేషన్ కగార్ అనే పేరుతో లక్షలాది బలగాలతో మధ్య భారతాన్ని సరిహద్దు ప్రాంతంగా మారుస్తూ యుద్ధ స్థితిని కొనసాగిస్తుంది అని, ఇది గాజా, ఉక్రేయిన్ల స్థితిని దాటిపోయింది. మన పక్కన ఉన్న చత్తీస్ ఘడ్ లో ఆదివాసీల జీవితంపై భారత సైన్యం తీవ్రంగా దాడి చేస్తున్న విధానాన్ని మానవత్వం గల మనుషులుగా ప్రజాస్వామ్యవాదులుగా అన్ని రాజకీయ పార్టీలు బిజెపి ప్రభుత్వం చేస్తున్న హత్యాకాండను నిలదీయడానికి ముందుకు రావాల్సిందిగా, తెలుగు రాష్ట్రాల్లోని హక్కుల సంఘాలన్ని కూడా ఈ పత్రికా ముఖంగా ప్రజలందరికి పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో ఏవిధంగానైతే సంబండ వర్గాలు కదిలి తెలంగాణను సాకారం చేసుకోగలిగామో, అదే విధంగా ఆదివాసీల హననాన్ని నిలువరించడానికి ఉద్యమాన్ని బతికంచుకోవడానికి మన వంతు బాధ్యతగా ముందుకు రావాల్సిందిగా పిలుపునిస్తాన్నాం.

సొంతూరులో మావోయిస్టు చలపతి అంత్యక్రియలు

శ్రీకాకుళం, తెలంగాణ సేన న్యూస్ : మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ చలపతి(62) అంత్యక్రియలు ముగిసాయి. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో బంధువులు, గ్రామస్తులు, సానుభూతిపరుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 19న ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లోని గరియాబంద్ జిల్లా కుల్హాడీఘాట్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్‌కౌంటర్‌లో చలపతితో పాటు మొత్తం 18 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఇవాళ చలపతి మృతదేహాన్ని బొడ్డపాడుకు తీసుకువచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు.

పీఏఎంవై కింద 20 లక్షల ఇళ్లు మంజూరు చేయండి

- మెట్రో ఫేజ్ - II ను జేవీగా చేపట్టాలి...
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు రూ.10 వేల కోట్లు కేటాయించండి..
- హైదరాబాద్, వరంగల్ డ్రైనేజీ స్కీంలకు నిధులు ఇవ్వండి..
- కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

హైదరాబాద్: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశ పట్టణ జనాభాలో 8 శాతం ప్రజలు తెలంగాణలో ఉన్నారని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. పీఏఎంవై (యూ)... పట్టణాభివృద్ధి, విద్యుత్ శాఖలపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పీఎంఏవై 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన డాటా, పూర్తి ప్రణాళికతో సన్నద్ధంగా ఉన్నందున రాష్ట్రానికి 20 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. దేశంలోని మహా నగరాలైన ఢిల్లీ, చెన్నై, బెంగళూరుతో పోల్చితే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టవిటీ తక్కువగా ఉందని... ఈ నేపథ్యంలో మెట్రో ఫేజ్- II కింద ఆరు కారిడార్లను గుర్తించామని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఇందులో కారిడార్ - IV : నాగోల్-శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), కారిడార్ - V : రాయదుర్గం-కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), కారిడార్- VI : ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), కారిడార్- VII : మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), కారిడార్- VIII : ఎల్ బీ నగర్-హయత్ నగర్ (7.1 కి.మీ), కారిడార్- IX : రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం-ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) (40 కి.మీ.) ఉన్నాయని.. ఇందులో మొదటి అయిదు కారిడార్లకు సంబంధించి (76.4 కి.మీ.) డీపీఆర్లు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి ఖట్టర్ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్లు వ్యయమవుతుందన్నారు. డీపీఆర్లు ఆమోదించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యం (జేవీ) కింద చేపట్టి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీలో మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కి.మీ. (మొత్తంగా 110 కి.మీ.) కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఇందుకోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీపంలోని 27 పట్టణ పాలక సంస్థల పరిధిలో మురుగు నీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్లతో సమగ్ర మురుగునీటి మేజర్ ప్లాన్ (సీఎస్ఎంపీ) తయారు చేశామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా సీఎస్ఎంపీని గుర్తించి నిధులు సమకూర్చాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రెండో పెద్ద నగరమైన వరంగల్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌ను నోటిఫై చేసిందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. వరంగల్ నగరంలో రూ.41,70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు...

పీఎం కుసుమ్ కింద లక్ష సౌర పంపులు కేటాయించండి..

తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన రైతులకు నిరంతరం సాగు నీరు అందించేందుకు వీలుగా పీఎం కుసుమ్ కింద లక్ష సౌర పంపులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కుసుమ్ -సీ ఎఫ్ఎల్ఎస్ కాంపొనెంట్ కింద 2,500 మెగావాట్లను కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. విద్యుత్ సరఫరా, నెట్‌వర్క్ బలోపేతానికి రూ.488 కోట్ల అంచనా వ్యయంతో 9 ప్రాజెక్టు నివేదికలను కేంద్రానికి సమర్పించామని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం, డిప్యూటీ సీఎం కోరారు. రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీం (ఆర్డీఎస్ఎస్)లో తెలంగాణ డిస్కమ్‌లను చేర్చాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ఇచ్చిన రుణాలకు సంబంధించిన వడ్డీ రేట్లను తగ్గించాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కొత్త పునరుత్పత్తి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి రెండు సంవత్సరాలకు పైగా సమయం పడుతుందని.. అందువల్ల ఆర్‌పీపీవో లక్ష్యాలను చేరుకోలేకపోయినందుకు విధించే జరిమానాలు మాఫీ చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. పునరుత్పత్తి విద్యుత్ నిర్వహణ కేంద్రాల అప్‌గ్రేడేషన్‌కు అవసరమయ్యే నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. సమీక్షలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్, ప్రజాసంబంధాలు) హర్కార వేణుగోపాల్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాస రాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి అభినందనలు...

తెలంగాణ రాష్ట్రానికి రూ.1.78 లక్షల కోట్లు పెట్టుబడులు సాధించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలంటున్నారని, అందులో తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలిపారు.

మద్యం ప్రియులకు షాకింగ్ న్యూస్

- ఇకపై ఆ ప్రాంతాల్లో లిక్కర్ బంద్..!
- మధ్యప్రదేశ్‌లోని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రాష్ట్రంలోని 17 ముఖ్య నగరాల్లో మద్య నిషేధాన్ని విధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన
- రాష్ట్రంలో మద్య నిషేధం దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో కొన్ని నగరాల్లో నిషేధాజ్ఞలు విధిస్తూ నిర్ణయం
- ఈ మేరకు రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

రాజకీయాలకు గుడ్ బై

- నా భవిష్యత్తు ఇక వ్యవసాయం
- రేపు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా
- వైఎస్సార్సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి
- ఇక నా భవిష్యత్తు వ్యవసాయం: విజయసాయిరెడ్డి
- పాలిటిక్స్ నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటన
- తాను ఏ పార్టీలోకి వెళ్లబోవడంలేదని స్పష్టీకరణ
- చంద్రబాబు కుటుంబంతో నాకెలాంటి విభేదాలు లేవు...
- పవన్ తో చిరకాల స్నేహం నాది: విజయసాయి
- టీడీపీతో రాజకీయంగా మాత్రమే విభేదించానని వెల్లడి

అమరావతి

రాజకీయాల నుంచి తప్పుకొంటున్నట్టు వైకాపా రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తెలిపారు. అదేవిధంగా రాజ్యసభ సభ్యత్వానికి శనివారం రాజీనామా చేస్తున్నట్టు ట్వీట్ చేశారు. ఏ రాజకీయ పార్టీలో చేరను. వేరే పదవులు, ప్రయోజనాలు ఆశించి రాజీనామా చేయడం లేదు. ఈ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం. ఎలాంటి ఒత్తిళ్లు లేవు. ఎవరూ ప్రభావితం చేయలేదు. నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా నన్ను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉన్నాను. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్, నన్ను ఇంతటి ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన భారతికి సదా కృతజ్ఞుడిని. జగన్‌కి మంచి జరగాలని కోరుకుంటున్నా. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా.. పార్టీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో శక్తివంచన

సంపాదకీయం

పాఠశాల విద్యలో సంస్కరణలు ఎటువైపు?

ప్రభుత్వ రంగంలో మంచి పాఠశాల విద్యకు ప్రధానంగా కావలసిన ఉపాధ్యాయుల నియామకం పట్ల గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. ఉపాధ్యాయ పోస్టులు తగ్గించుకోవడానికి పాఠశాల విద్యను విధ్వంసం చేసిన జీఓ 117 తీసుకువచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ జీఓ రూపాన్ని మాత్రమే మారుస్తుందా, సారాన్ని కూడా మారుస్తుందా అన్నది పాఠశాల విద్య ముంగిట ఉన్న పెద్ద సమస్య. ఈ జీఓ ఉపసంహరణ ప్రక్రియ పేరుతో ప్రభుత్వం జనవరి 9న విడుదల చేసిన మెమో ఇక్కడ చర్చనీయాంశం. గత ప్రభుత్వం జీఓ 117 ద్వారా ఐదు ప్రధాన సమస్యలను సృష్టించింది: 1) ప్రాథమిక పాఠశాలలను నిలువునా రెండు ముక్కలు చేసి 3, 4, 5 తరగతుల బాలబాలికలను ఉన్నత పాఠశాలలకు పంపింది. అత్యధిక సందర్భాల్లో ఉన్నత పాఠశాలలకు వెళ్ళిన విద్యార్థులు నిర్లక్ష్యానికి గురికాగా, 1, 2 రెండు తరగతులతో మిగిలిపోయిన ఫౌండేషన్ పాఠశాలలతో కలిపి సుమారు 15 వేల ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా దిగజారిపోయాయి. 2) 1 నుంచి 8 వరకు ఉండే అత్యధిక ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య ఎనిమిది నుంచి నాలుగు లేదా ఐదుకు తగ్గించారు. ఆ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 3) అత్యధిక ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడు, పి.ఇ.టి పోస్టులు రద్దు చేశారు. 4) ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత విభాగాల్లో తరగతి గదిలో విద్యార్థుల గరిష్ఠ సంఖ్యను వరుసగా 30, 35, 40/50 నుంచి వరుసగా 40, 52, 60గా మార్చారు. ఇంకా, వారానికి ఉపాధ్యాయులు గరిష్టంగా బోధించవలసిన పీరియడ్లను 32 నుంచి 42కు పెంచారు. దీనితో విజయవంతంగా నడుస్తున్న ఎక్కువ నమోదుగల పాఠశాలలు అవసరమైన ఉపాధ్యాయ పోస్టులను కోల్పోయి నష్టపోయాయి. 5) ప్రభుత్వ పాఠశాలల్లో సమాంతరంగా నడుస్తున్న మాతృభాషా మాధ్యమ విభాగాలను రద్దుచేశారు. జీఓ 117 రద్దు చేయమని, పాఠశాల పునర్వ్యవస్థీకరణ జీఓ 84ను, ప్రాథమిక విద్య అందుబాటు దూరపరిమితి పెంపు జీఓ 85ను రద్దుచేయమని సుమారు అన్ని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు కూడా డిమాండు చేశాయి. కానీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన మెమోలో విద్యార్థులు ప్రకాశవంతమైన భవిష్యత్‌తో గ్లోబల్ పౌరులు కావాలని లక్ష్య నిర్దేశం చేశారు. ప్రాథమిక విద్య పూర్తిచేసిన విద్యార్థులకు గత 20 ఏళ్లుగా చదవనూ రాయనూ రావడం లేదు. ఈ పరిస్థితుల్లో అంత గొప్ప లక్ష్య నిర్దేశం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇక ఆ మెమోలో ఏముందో చూద్దాం. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు మారుస్తున్నారు. ఇది మంచి పరిణామం. అయితే ప్రాథమిక విద్య అందించే అత్యధిక పాఠశాలలు గతంలో జీఓ 117 పద్ధతిలోనే రెండవ తరగతి వరకు మాత్రమే విద్య అందించే ఫౌండేషన్ పాఠశాలలుగా కొనసాగుతాయి. కొన్ని పాఠశాలలు మాత్రమే జీఓ 117 ముందు స్థాయికి వస్తాయి. అందులో కూడా కొన్ని బేసిక్ పాఠశాలలుగా, కొన్ని ఆదర్శ పాఠశాలలుగా వ్యవస్థీకరిస్తారు. ఆదర్శ పాఠశాలలు ఆదర్శంగా తయారవుతాయో లేదో కాని, బేసిక్ పాఠశాలలు కునారిల్లిపోతాయనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ మెమో ప్రకారం 60 లోపున విద్యార్థుల నమోదు ఉన్న ఏడు తరగతులకు (ఎల్.కె.జి–యు.కె.జి– 1 నుంచి 5 తరగతులకు) కలిపి ఇద్దరు టీచర్లను ఇస్తారు. వీటిని బేసిక్ పాఠశాలలు అంటారు. ఇవి పెద్ద సంఖ్యలో ఉంటాయి. వీటి పరిస్థితి దారుణంగా ఉంటుందని వేరుగా చెప్పనవసరం లేదు. ఇక నమోదు 60 దాటిన ప్రాథమిక పాఠశాలలకు ఏడు తరగతులకు (ఎల్.కె.జి–యు.కె.జి 1 నుంచి 5 తరగతులకు) కలిపి ఐదుగురు ఉపాధ్యాయులను ఇస్తారు. వీటిని ఆదర్శ పాఠశాలలు అంటారు. ఇటు బేసిక్ పాఠశాలలకు గాని, అటు ఆదర్శ పాఠశాలలకు గాని పూర్వ ప్రాథమిక విద్యకు (ఎల్.కె.జి– పిపి1– యు.కె.జి– పిపి2లకు) ప్రత్యేకంగా ఉపాధ్యాయులను ఇవ్వరు. ఇక కొన్ని ఆదర్శ పాఠశాలలకు ఐదుగురు ఉపాధ్యాయులను ఇవ్వడానికి పెద్ద సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలను 2వ తరగతి వరకు బోధించే ఫౌండేషన్ పాఠశాలలుగా కుదించడం, ఎల్.కె.జి నుంచి 5వ తరగతి వరకు మొత్తం ఏడు తరగతులు ఉండే బేసిక్ పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయులను మాత్రమే ఇవ్వడం ఎంతవరకు సమంజసం? విద్యార్థి%–%ఉపాధ్యాయ నిష్పత్తి విషయంలో 'కేంద్ర విద్యా హక్కు చట్టం (బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009)' తగిన స్థాయిలో లేదు. ఆపైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు 'విద్యాహక్కు చట్టానికి మినహాయింపుగా' ఇచ్చిన ఒక తీర్పును ఉపయోగించుకుని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థి నమోదు 20 వరకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడ్ని ఇస్తూ వచ్చారు. ఇప్పుడూ అందులో మార్పులేదు. ఇక, నమోదు 21%–%40 స్లాబ్‌లో విద్యాహక్కు చట్టం ప్రకారం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయిస్తున్నారు, కాని గురువారం విడుదల్కైన మెమో ప్రకారం నమోదు 21%–%30 ఉన్న ఫౌండేషన్ పాఠశాలలకు (ఎల్.కె.జి, యు.కె.జి ఇంకా 1వ తరగతి, 2వ తరగతి) ఒక ఉపాధ్యాయుడ్నే కేటాయించడం ఒక కొత్త కత్తిరింపు. ఆదర్శ పాఠశాలల స్థాపన పేరున ఈ కత్తిరింపులు జరుగుతున్నాయి. నమోదు 41%–%60 ఉన్న ప్రాథమిక పాఠశాలలను బేసిక్ పాఠశాలలుగా పరిగణిస్తూ ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున మాత్రమే ఇవ్వబోతున్నట్లు ఇటీవలి మెమో బట్టి తెలుస్తుంది. ఈ స్లాబ్‌లో మూడవ ఉపాధ్యాయుడ్ని ఎందుకివ్వకూడదు? ఈ స్లాబ్‌లో కనీసం ప్రతి పంచాయితీకి ఒక పాఠశాల ఉంటుంది. మూడవ పోస్టును కేటాయించి వాటిని బలపరచవచ్చు, ఇంకా బాలబాలికల నమోదు 40, 60, 90 దాటిన ప్రాథమిక పాఠశాలలన్నింటికీ విద్యాహక్కు చట్టానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక పోస్టును ఇస్తే ప్రాథమిక స్థాయిలో సార్వత్రికంగా విద్యా ప్రమాణాలు పెరుగుతాయి. అత్యధిక పాఠశాలలు ఆదర్శ పాఠశాల వైపు అడుగులు వేయగలుగుతాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నమోదు కూడా పెరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఇచ్చే ఆ పోస్టును ఆంగ్ల భాషా బోధనకు ఉద్దేశించవచ్చు. మాతృభాషా మాధ్యమం, ఆంగ్లభాషా బోధన రెండూ సాధించవచ్చు. ఇందుకోసం ప్రభుత్వం కొత్తగా పోస్టులు మంజూరు చేయవలసిన అవసరం లేదు. ఇప్పటికే మంజూరై ఖాళీగా ఉన్న పోస్టులను మార్పుచేసి నింపితే సరిపోతుంది. ప్రాథమికోన్నత పాఠశాలల విషయానికి వస్తే– ఎ) 6, 7, 8 తరగతుల నమోదు 60 పైన ఉంటే ఆ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాల చేస్తామంటున్నారు. జీఓ 117 అమలు కారణంగా గత రెండు సంవత్సరాలుగా ప్రాథమికోన్నత పాఠశాలలు బాగా తెబ్బతిన్నాయి. అప్‌గ్రేడేషన్ అవకాశం ఉండకపోవచ్చు. బి) 6, 7, 8 తరగతుల నమోదు 30లోపున ఉంటే అటువంటి ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా కుదిస్తారు. గత రెండు సంవత్సరాలుగా నమోదు తగ్గినందున చాలా ప్రాథమికోన్నత పాఠశాలలు ఈ నిబంధనకు గురవుతాయి. సి) 6, 7, 8 తరగతుల నమోదు 31 నుంచి 59 ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రాథమికోన్నత విభాగాల కొనసాగింపు ఆయా సందర్భాలను బట్టి నిర్ణయిస్తామని చెప్తున్నారు. వాటి ఉనికి ప్రశ్నార్థకం చేశారు. 2017లో ప్రాథమికోన్నత పాఠశాలల విషయమై విస్తృతంగా చర్చ జరిగి, ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని ఇచ్చిన జీఓ 29, 33, 42లను ప్రస్తుత అధికారులు పరిశీలించాలి. ఉన్నత పాఠశాల లేని దగ్గర కనీసం ప్రాథమికోన్నత పాఠశాల్కైనా ఉండడం బాలికల విద్యకు చాలా అవసరం. ఆవాస ప్రాంతం నుంచి ఒక కిలోమీటరు పరిధిలో ఐదవ తరగతి వరకు, మూడు కిలోమీటర్ల పరిధిలో 6, 7, 8 తరగతులు అందుబాటులో ఉండాలని, అందుకై 2021 డిసెంబర్‌లో వచ్చిన దూర పరిమితి జీఓ 85ను రద్దు చేసి అంతకు ముందటి విధానాన్ని పునరుద్ధరిస్తామని మెమోలో పేర్కొనలేదు. మంజూరై ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నీ నింపకుండా సామీప్యతకు, విద్యాప్రమాణాలకు మధ్య ఘర్షణ చూపుతున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఒక తరగతిలో విద్యార్థుల సంఖ్య 54 దాటితే రెండవ సెక్షన్ ఆరంభించడానికి అనుమతించడం మంచి పరిణామమే. జీఓ 117 ప్రకారం ఈ సంఖ్య 60 ఉంది. ఈ మెమోలో ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల పనిభారం గురించి ఒక చోట ప్రస్తావించారు. కాని ఒక వారంలో ఉపాధ్యాయులు బోధించవలసిన గరిష్ఠ పీరియడ్లను 42 నుంచి 32కి పునరుద్ధరించలేదు. ఇది ఉపాధ్యాయుల సమస్య కాదు, విద్యా ప్రమాణాల సమస్య అని అధికారులకు అర్థం కావడం లేదు.

– డి. రమేష్ పట్నాయక్
కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటి

రేషన్ కార్డులు అర్హులకు దక్కినపుడే ఆహారభద్రత!

రాష్ట్రంలో జనవరి 21 నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం మళ్ళీ ప్రజల వద్ద దరఖాస్తులు తీసుకుంటామని, గతంలో ప్రజాపాలనలో భాగంగా తీసుకున్న దరఖాస్తులను కూడా పరిగణనలో పెట్టుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తామనీ, ఇకపై అర్హులకు ఆహార భద్రత కార్డుగా ఇచ్చే స్మార్ట్ కార్డ్ వాడి రేషన్ దుకాణాల నుంచి బియ్యం తీసుకోవచ్చని కూడా నిర్ణయించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ వెబ్‌సైట్ అందిస్తున్న వివరాల ప్రకారం%–% అంత్యోదయ అన్న యోజన, అన్నపూర్ణ కార్డులు సహా మొత్తం రేషన్ కార్డుల ద్వారా ప్రస్తుతం రాష్ట్రంలో ప్రస్తుత రాష్ట్ర జనాభా 3,81,00,000 మందిలో 2,81,63,759 మంది రేషన్ లబ్ధిదారులుగా ఉన్నారు. జీడీపీ, జీఎస్‌డీపీ ఆధారిత ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ప్రభుత్వాలు చెప్పుకున్నప్పటికీ, దేశంలో పేదరికం, ఆకలి, నిరుద్యోగం తగ్గడం లేదు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు మన దేశం ఇంకా చాలా దూరంలో ఉంది. దేశంలో, రాష్ట్రంలో అనారోగ్య మరణాలు, అకాల మరణాలు పెరిగిపోతున్నాయి. స్త్రీలలో, పిల్లల్లో రక్తహీనత పెరుగుతున్నది. ఆహార భద్రత చట్టం కింద కార్బోహైడ్రేట్స్ అందించడానికి బియ్యం, గోధుమల లాంటివి నెలకు ఐదు కిలోలు ఉచితంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పంపిణీ చేస్తున్నప్పటికీ, నిజమైన పోషకాహార భద్రత మెజారిటీ ప్రజలకు ఇప్పటికీ అందడం లేదు. భారతదేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లక్షల కోట్లు ఖర్చు పెట్టి, ప్రజలకు చవక ధరలకు ఆహారాన్ని అందిస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ, దేశ జీడీపీలో ఆహార సబ్సిడీపై కేంద్ర ప్రభుత్వం పెడుతున్న ఖర్చు వాటా 2014%–%–15లో 0.9 శాతం కాగా, అది 2024%–%–25 నాటికి 0.6 శాతానికి పడిపోయింది. కరోనా కాలంలో ఒక్క సంవత్సరం 2020–%–%21లో మాత్రమే అది జీడీపీలో 2.7 శాతానికి చేరింది. నిజానికి కేంద్ర ప్రభుత్వం జీడీపీలో కనీసం 5 శాతం కేటాయించినా అన్ని ముఖ్యమైన ఆహార ఉత్పత్తులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు సబ్సిడీ ధరలపై అందించవచ్చు. సమగ్ర కుటుంబ సర్వే నివేదికపై మార్చి 2019లో ప్రభుత్వ ప్రెజెంటేషన్ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డులు పొందడానికి అర్హులు ఎవరంటే%–% దళిత కుటుంబాలుబీ అత్యంత వెనుకబడిన ఆదివాసీ తెగల కుటుంబాలుబీ ఇతర గిరిజన కుటుంబాలుబీ దినసరి కూలీ కుటుంబాలుబీ ఇంట్లో ఒక్క గది మాత్రమే ఉన్న కుటుంబాలుబీ మట్టితో కట్టిన ఇల్లు, తాత్కాలిక షెల్టర్, పాక్షికంగా ధ్వంసం అయిన రెండు గదుల ఇల్లు ఉన్న కుటుంబాలుబీ అనాథలు, వికలాంగులు ఉన్న కుటుంబాలు, శాశ్వత నివాసం లేని సంచార జాతుల కుటుంబాలుబీ ఇతర చోట్ల శాశ్వత నివాసం ఉన్న సంచార జాతులుబీ ఇప్పటికీ వృత్తిలో ఉన్న చేతి వృత్తుల కళాకారులు. ఆహార భద్రత రేషన్ కార్డు మంజూరు చేయడానికి ప్రధాన మార్గదర్శకం గ్రామీణ ప్రాంతంలో లక్షన్నర లోపు ఆదాయంబీ పట్టణ, నగర ప్రాంతాలలో 2 లక్షల లోపు ఆదాయం కలిగి ఉండడం. ఈ ఆదాయాన్ని నిర్ధారించడానికి ప్రాతిపదిక%–% రెవెన్యూ శాఖ అధికారులు ఎంక్వైరీ చేసి ఆదాయ సర్టిఫికెట్ జారీ చేయటం. కుటుంబ సభ్యులు ఇచ్చే సమాచారం కాకుండా, ఈ అధికారులకు మరో రూపంలో కుటుంబ ఆదాయాన్ని తెలుసుకునే మార్గమేమీ లేదు. రెవెన్యూ అధికారులు అవినీతికి పాల్పడి, ఒక కుటుంబానికి అతి తక్కువ ఆదాయం చూపిస్తూ ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ చేస్తే దానికి ఎంత క్రెడిబిలిటీ ఉన్నట్లు? తెలంగాణ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రైవేట్ రంగ సంస్థలలో ముఖ్యంగా వివిధ వ్యాపార, వాణిజ్య, సేవా రంగ సంస్థలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న దశలో నెలసరి వేతనంపై ఆధారపడి బతుకుతున్న వారి సంఖ్యపై ఎవరికీ స్పష్టత లేదు. అలాగే వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న పర్మినెంట్, క్యాజువల్, కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్యపై కూడా స్పష్టత లేదు. వివిధ రాష్ట్రాల నుండీ తెలంగాణకు తరలివస్తున్న వలస కార్మికుల వివరాలను నమోదు చేసే యంత్రాంగం, విధానం కూడా లేదు. ముఖ్యంగా పట్టణ, నగర ప్రాంతాలలో ప్రైవేట్ రంగంలో కార్మికుల, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ, వారికి ఆయా సంస్థలలో నియామక పత్రాలు, వేతన రసీదులు, సాంఘిక సంక్షేమ పథకాలు ఉండవు. పని గంటలు, సెలవులు కూడా నిర్దిష్టంగా ఉండవు. అదనపు పని గంటలు పని చేస్తే, అదనపు వేతనం చెల్లిస్తారన్న గ్యారంటీ లేదు. ఇవన్నీ ప్రైవేట్ రంగ ఉద్యోగులకు, కార్మికులకు అందేలా చూడాల్సిన బాధ్యత కార్మిక శాఖపై ఉంది. కానీ గత మూడు దశాబ్దాలుగా కార్మిక శాఖ ఆ బాధ్యత తనది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రైవేట్ రంగంలో ఉపాధి పొందుతున్న వారి ఆదాయాలు స్పష్టంగా తెలుసుకునే అవకాశం ఎంత మాత్రం లేదు. కాబట్టి రేషన్ కార్డు కావాలనుకున్న ప్రతి కుటుంబం మార్గదర్శకాలకు అనుగుణంగా స్వయం ప్రకటిత డిక్లరేషన్‌తో, ఆదాయం చెప్పి దరఖాస్తు చేసుకుంటున్నది. ఆయా కుటుంబాల వద్దకు ఎంక్వైరీకి వెళ్ళిన రెవెన్యూ సిబ్బంది, తమ విచక్షణతో దానిని ఆమోదించడమో తిరస్కరించడమో చేస్తున్నారు. కానీ నిజానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో దినసరి కూలీలను, పీస్ రేట్లపై పని చేస్తున్న హమాలీ కార్మికులను, ఇళ్ళలో పనిచేసే లక్షలాది మహిళా కార్మికులను, స్వయం ఉపాధి శ్రామికులను, ప్రైవేట్ రంగ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులను, ఉద్యోగులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలలోనూ, ప్రభుత్వంలోనూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను, కార్మికులను, గత ఐదారేళ్లుగా కొత్తగా రంగంలోకి వచ్చిన గిగ్ అండ్ ప్లాట్‌ఫారం శ్రామికులను, ముఖ్యంగా రవాణా రంగంలో వచ్చిన ఓలా, ఊబర్ లాంటి ప్రైవేట్ సంస్థలలో స్వంత కారుతో, లేదా కారు కిరాయికి తీసుకుని జీవనోపాధి ఏర్పాటు చేసుకుని క్యాబ్ నడుపు కుంటున్న వారిని, ఇతర ప్రమాణాల రీత్యా పేదరికంలో ఉన్న వారిగా పరిగణించాలి. వారికి రేషన్ కార్డు మంజూరు చేయడానికి, ఇప్పటి వరకూ అమలైన మార్గదర్శకాలలో వెంటనే మార్పులు చేయాలి. కాబట్టి గ్రామీణ ప్రాంతంలో రేషన్ కార్డు జారీకి కుటుంబానికి ప్రస్తుతమున్న సంవత్సరానికి లక్షన్నర ఆదాయ పరిమితిని మూడు లక్షల రూపాయలకు, పట్టణ ప్రాంతాలలో సంవత్సరానికి ప్రస్తుతమున్న రెండు లక్షల ఆదాయ పరిమితిని మూడు లక్షల అరవై వేల రూపాయలకు పెంచాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఈ వేతనం లోపు ఉన్న కుటుంబాలకు ఆహార భద్రత కోసం రేషన్ కార్డు అందేలా చర్యలు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతంలో భూముల విలువలు పెరిగిన మాట నిజమే కానీ, వ్యవసాయంపై ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. ఎన్ఎస్ఎస్ఓ నివేదిక ప్రకారం ఐదు ఎకరాలలోపు రైతు కుటుంబ ఆదాయం నెలకు రూ.9400 మాత్రమే. పైగా చాలా కాలంగా తెలంగాణ రాష్ట్ర భూములలో మాగాణి, మెట్ట భూముల వర్గీకరణ చేయడం లేదు. కాబట్టి, రేషన్ కార్డు జారీకి ఇప్పటి వరకూ ఉన్న మాగాణి మూడు ఎకరాలు, మెట్ట ఏడున్నర ఎకరాలు అనే నిబంధన తొలగించి, 5 ఎకరాలలోపు సన్న, చిన్నకారు రైతులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి. ఇంట్లో ఉన్న గదుల సంఖ్యను బట్టి ఒక

నిర్ధారణకు రావడం కూడా పారదర్శకంగా లేదు. ఇది కూడా అధికారుల విచక్షణపై మాత్రమే అమలయ్యే నిబంధన. సిబ్బంది అవినీతికి అవకాశం ఇచ్చే నిబంధన. కాబట్టి సిబ్బంది విచక్షణాధికారం నుండీ దీనిని తొలగించి, ఇంటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఆధారంగా, 100 చదరపు మీటర్ల లోపు ఇళ్లను లేదా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగం ఉండే ఇళ్లను (రెండిటిలో ఏదైనా) రేషన్ కార్డు పొందడానికి అర్హమైన ఇళ్లుగా పరిగణనలో పెట్టుకోవాలని వచ్చిన ఒక సూచనను చర్చకు స్వీకరించాలి. నిజానికి రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి చిన్న ఇల్లు ఉండడం ఒక హక్కుగా మారాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర వ్యాపితంగా ఇళ్ళు లేని పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేస్తామని అంటోంది. ఈ నేపథ్యంలో స్వంత ఇంటి విస్తీర్ణంపై రేషన్ కార్డు జారీకి నిబంధనలలో తగిన సవరణలు చేయాలి. అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడం ఎంత అవసరమో, అనర్హులకు తొలగించడం కూడా అంతే బాధ్యతగా చేయాలి. లేకపోతే వేల కోట్ల నిధులు దుర్వినియోగం అవుతాయి. అలాగే రేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియను అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా నిరంతరం కొనసాగించాలి. ఎప్పటికప్పుడు తగిన విచారణ చేసి కార్డులు మంజూరు చేయాలి. **– కన్నెగంటి రవి**

తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

ఆపరేషన్ కగార్ ఆపివేయాలి

ఏడాది కాలంగా మధ్యభారత, గోదావరి తీర అరణ్యాలలో సాగుతున్న కగార్ మారణ కాండల్లో ఇప్పటికే మరణించినవారిని వ్యక్తులుగా చెప్పడం కష్టమై 300 సంఖ్యతో ఇప్పటికే ఎన్ కౌంటర్ పేరుతో హత్య గానించబడ్డారు. 1 జనవరి 2024 6 నెలల పాప నుంగ్గీ సోడితో ప్రారంభమైన కగార్ ఎన్ కౌంటర్ హత్యాకాండ గత ఏడాదితో 300 వరకు వస్తే, ఈ ఏడాది ప్రారంభంలో నెల పూర్తి కాకుండానే 50 సంఖ్యను దాటేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ అణచివేత చత్తీస్‌ఘడ్ అబూజ్మడ్ ప్రాంతంలో అందులో నారాయణపూర్, బీజాపూర్, దంతెవాడ జిల్లాలోని మొత్తం 4 వేల కిలోమీటర్ల దట్టమైన అటవీ ప్రాంతంలో ఇది కొనసాగుతుంది. ఇందులో 237 గ్రామాల్లో గోండు, మోరియా, అబూజ్ మరియు హల్వా తెగకు చెందిన 35 వేల మంది ఆదివాసీలు జీవిస్తున్నారు. ఇక్కడ ఇనుప ఖనిజం, గ్రాఫైట్, సున్నపురాయి, యురేనియంతో పాటు 28 రకాల 70 కోట్ల టన్నుల ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ఖనిజ వనరులను కార్పొరేట్లకు అప్పజెప్పడానికే కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే 104 ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఈ ఎం.ఒ.యు.ల ఒప్పందాలు 2005 నుంచి కొనసాగుతున్నాయి. కానీ ఇక్కడున్న ఆదివాసీలు జల్, జంగిల్, జమీన్పై ఆదివాసీలకే హక్కు ఉందని పోరాటం ద్వారా చేస్తున్నారు. రాజ్యాంగం, చట్టాలు కూడా వారికి అనుకూలంగానే ఉన్నాయి. 1996లో వచ్చినటువంటి పేసా చట్టం గ్రామ సభల తీర్మానమే అంతిమంగా చెబుతూ అడవిపై ఆదివాసీలదే హక్కు ఉందని బలంగా ప్రకటిస్తున్నది. కార్పొరేట్ల అభివృద్ధి కోసం దేశ మూలవాసులైన ఆదివాసీలను అదే విధంగా ప్రజాస్వామ్య విఫలతలోంచే తప్పనిసరై సాయుధ పోరాటం చేస్తున్న విప్లవకారులను పూర్తిగా అంతమొందించైనా సరే కార్పోరేట్లకు ఖనిజ సంపదను అప్పగించాలని ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తున్నది. అందులో భాగంగానే ఆపరేషన్ కగార్ పేరుతో 650 పోలీసు క్యాంపులను 7 లక్షల పోలీసు బలగాలను 100లాది డ్రోన్లను పదుల సంఖ్యలో హెలికాప్టర్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపయోగిస్తూ ఆదివాసీల హననానికి మావోయిస్టుల నిర్మూలనకు యుద్ధం కొనసాగిస్తున్నాయి. ఇది ప్రజాస్వామిక దేశంలో ప్రజలు ఉద్యమకారులు ఏ విధంగానైనా తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేసే హక్కు అవకాశం ఉంది. ప్రభుత్వాలు సమస్యలను పరిష్కరించడం కన్నా ఉద్యమాల అణచివేతనే పరిష్కారంగా భావిస్తూ ఇప్పటికి 50 ఏళ్ళుగా ఇప్పటికీ అణచివేతనే కొనసాగిస్తూ ఉద్యమ చరిత్రలోనే ఇప్పటికే 20 వేలకు పైగా ఎన్ కౌంటర్ హత్యలను కొనసాగించాయి. కాని గతంలో ప్రభుత్వాలెప్పుడు కూడా అంతమొందిస్తాం హత్యలు చేస్తామని తేదీలు నిర్ణయించి బలగాలను దించి దాడి చేయడమనేది రాజ్యాంగ ప్రభుత్వాలుగా భావించలేము. 2005 నుండి సల్వాజుడుం పేరుతో వేలాది మంది ఆదివాసీలను రమణ్సింగ్ ప్రభుత్వం హత్య చేసింది. ప్రొ.నందిని సుందర్, జస్టిస్ సుదర్శన్ రెడ్డిప్రజాస్వామిక బాధ్యత వలన సల్వాజుడుం రద్దుకాబడింది. కాని అందులో పని చేసిన వారందరిని డిఆర్ బలగాల పేరుతో కొత్త ఫోర్సుగా ప్రభుత్వంలో చేర్చుకున్నారు. సల్వా జుడుం తర్వాత 2009 లో ఆపరేషన్ గ్రీన్ హంట్ ప్రకటించబడింది. దీనితో సిఆర్పిఎఫ్ బలగాలతో పాటు డిఆర్ జి బలగాలు కూడా ఆదివాసులపై దాడులు చేస్తూ హత్యాకాండను కొనసాగించాయి. అందులో భాగంగానే 2012లో జరిగిన బాసగూడ హత్యాకాండ, 2013 లో ఎడిసిమెట్టలో కూడా ఇటువంటి మారణకాండనే కొనసాగించారు. ఒక్కక్క ఎన్ కౌంటర్ ఘటనలో 17 మంది ఆదివాసీలు మరణించారు. ఇందులో స్కూలుకు వెళుతున్న మైనర్ బాలురు 5గురు ఉన్నారు. దానిపై ఏర్పాటు చేసిన జస్టిస్ అగర్వాల్ ఏక సభ్య కమీషన్ కూడా ఇది ఎన్ కౌంటర్ కాదని స్పష్టం చేసింది. 2011 నుండి ఆపరేషన్ గ్రీన్హంట్ రెండవ దశ అమలవుతూ వస్తుంది. ఈ కాలంలో ఆదివాసీల అక్రమ అరెస్టులు నిర్విరామంగా కొనసాగాయి. సుక్మా, దంతెవాడ, జగల్పూర్, రాయపూర్ జైళ్ళన్నీ ఆదివాసీలతో నింపబడ్డాయి. అందరిపై ఉపా కేసులు నమోదు కాబడ్డాయి. చత్తీస్ఘడ్ ప్రత్యేక భద్రతా చట్టం కేస్ కూడా మోపబడింది. 2017 నుండి ఆపరేషన్ సమాధాన్ పేరుతో డ్రోన్లతో దాడి ప్రారంభించారు. ఈ స్థితిలోనే అక్కడ ఉన్నటువంటి జర్నలిస్టులకు పత్రికా స్వేచ్ఛ లేకుండా పోయింది. ఇది 1990లో అప్పుడున్న కలెక్టర్ ఎట్లయితే అడవిలోకెళ్ళి ఎవరు వార్తలు సేకరించినా గాని వారిని కాల్చి పారేయండని బహిరంగంగా మాట్లాడిన స్థితి నేడు అమలవుతున్నది. అందులో భాగంగానే చత్తీస్ ఘడ్లో జరిగిన రహదారి అవినీతి కేసును బయటకు తీసినందుకు ముఖేష్ చంద్రాకర్ అనే యువ జర్నలిస్టును అత్యంత కిరాతకంగా గుండెను బయటకు తీసి కాలేయం నాలుగు ముక్కలుగా నరికి హత్య చేయడం అక్కడ ఎవరూ కూడా న్యాయం గురించి మాట్లాడొద్దని హెచ్చరించినట్లుగానే మనకు అర్థమవుతుంది. ఇది ఒక వైపు గతంలో ఉన్న ఐజి ఎస్ఆర్పి కల్లూరి కొనసాగించిన దాడినే నేడు ఉన్న ఐజి సుందర్ రాజ్ కొనసాగిస్తున్నాడు. కల్లూరి కాలంలో బిబిసి కాని అమ్నెస్టీ కాని చత్తీస్ ఘడ్ లో పర్యటించడానికి అవకాశం లేకుండా చేసి చత్తీస్ ఘడ్ ఆవలకు నెట్టేసిన చరిత్ర వారికుంది. అప్పుడే ఎడిటర్స్ గిల్డ్ అనే సంస్థ ఇక్కడ వార్తా సేకరణ అనేది పూర్తి ప్రమాదకరంగా మారిందని ప్రకటించారు. ఆ స్థితి నుండి చత్తీస్ఘడ్ ప్రాంతంలో బస్తర్ టాకీస్ పేరుతో, బస్తర్ జంక్షన్ల పేరుతో యూట్యూబ్ ఛానల్లు అక్కడ జరుగుతున్న ఎన్ కౌంటర్ దాడులను గాని హత్యాకాండలను గాని ప్రజలకు అందించడంలో తమ వంతు బ

గజ్వేల్ లో బీజేపీ నాయకులకు ఘన సన్మానం

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షులు పంజల అశోక్ గౌడ్, కుకునూరుపల్లి మండల అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెప్యాల వెంకట్ రెడ్డి నూతన బాధ్యతలు తీసుకున్న సందర్భంగా గజ్వేల్ లో శుక్రవారం శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపిన ఎస్సీ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షులు నత్తి శివకుమార్ మాట్లాడుతూ బీజేపీ శ్రేణులు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని రాబోయే ఎన్నికల్లో బీజేపీ గెలుపుకు పాటు పడాలని అన్నారు గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు అశోక్ గౌడ్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు వెంకట్ రెడ్డి, కుకునూర్ పల్లి మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డికి చిరు సన్మానం చేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ గజ్వేల్ పట్టణ సీనియర్ నాయకులు మద్గుర నరసింహ ముదిరాజ్, మండల సీనియర్ నాయకులు భీమ్ కుమార్, డోకి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీ విజయవంతం చేయాలి దారం గురువారెడ్డి

సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో శుక్రవారం సీనియర్ బిజెపి నాయకుడు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దారం గురువారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ క్రికెట్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి 26 నుండి స్థానిక ఐఓసీ గ్రౌండ్స్ లో సిద్ధిపేట జిల్లా స్థాయి తెలంగాణ గోల్డ్ కప్ 2025' క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ టోర్నమెంట్ లో మొత్తం 20 జట్లు నాలుగు గ్రూపులుగా లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారని అన్నారు, ఇదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాలలో తెలంగాణ గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం జరుగుతుందన్నారు, విజేతలకు రూ. 50వేల నగదు బహుమతి, రన్నరప్ జట్టుకు రూ.25 వేల నగదు బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. ఈ టోర్నమెంట్ లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయిలో జరిగే తెలంగాణ గోల్డ్ కప్ లో ఆడే జిల్లా స్థాయి టీం కు ఎంపిక జరుగుతుంది అని అన్నారు తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ కు త్వరలో బీసీసీఐ గుర్తింపు లభిస్తుందని తెలిపారు. బీసీసీఐ గుర్తింపు తర్వాత అన్ని జిల్లా కేంద్రాలతో పాటు గజ్వేల్ లో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం లో సిద్ధిపేట జిల్లా తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ హరిప్రసాద్, బీజీపీ సీనియర్ నాయకులు కుడిక్యాల రాములు, నత్తి శివ కుమార్,గజ్వేల్ పట్టణ బిజెపి అధ్యక్షులు మనోహర్ యాదవ్, గజ్వేల్ మండలం బిజెపి అధ్యక్షుడు అశోక్ గౌడ్, కుకునూరుపల్లి మండల బిజెపి అధ్యక్షుడు సంపత్ రెడ్డి, బిజెపి కౌన్సిల్ సభ్యుడు వెంకట్ రెడ్డి, నాయకులు నాయిని సందీప్, నరసింహా, నాగేందర్, భాస్కర్ రెడ్డి,, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్రియాశీల నాయకుడు పరిటాల రమి- కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, తెలంగాణ సేన న్యూస్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్లో పరిటాల రవి 20వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిటాల రవి మంత్రిగా ఉన్న సమయంలో వారు ప్రజలకు చేసిన సేవలు గొప్పవని కొనియాడారు. అలాగే పేద ప్రజలకు అండగా నిలిచిన ప్రజా నాయకుడు పరిటాల రవి అన్నారు.. వారి సేవలు ఎల్లప్పుడూ ప్రజల మధ్యలో మెదులుతాయి అన్నారు.. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ జెట్టి కుసుం కుమార్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నర్సిరెడ్డి భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజవర్గం ఇంచార్జ్ హనుమంత్ రెడ్డి, కూకట్ పల్లి నియోజవర్గం ఇంచార్జ్ బండి రమేష్ గార్లతో పాటు బండి శ్రీనివాస్ గౌడ్, పులి సందీప్, మోతి శ్రీనివాస్ యాదవ్, అర్వ వెంకట్, గుమస్తా మధు, ప్రభాకర్ రెడ్డి నిర్వాహకులు నీలపాటి కరుణాకర్ రావు, సుండూరి అనంత చౌదరి, అంతయ్య, శశి, కోటేశ్వరరావు, వంశీ, రమేష్, శివాజీ, పరిటాల రవి అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ

కుత్బుల్లపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ 26వ వార్డులో ఈరోజు సొంత నిధులతో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ గుడి ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ. అనంతరం వార్డులోని నూతనంగా నిర్మించబోయే కమాన్ మరియు బీరప్ప ఆలయం వద్ద నిర్మించనున్న ఆలయ మెట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద సహాయ సహకారాలతో ఎంతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 24 వ వార్డు కౌన్సిలర్ అర్కల అనంత స్వామి ముదిరాజ్, 24 వ వార్డు ప్రెసిడెంట్ గండిగూడెం రమేష్ ముదిరాజ్, మరియు కుర్మ సంఘం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మల్లం సుమతి

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోల్గూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెప్యాల రామయ్య మరణించిన విషయం తెలుసుకొని తాజామాజీ సర్పంచ్ మల్లం రాజు సతీమణి మల్లం సుమతి శుక్రవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఈ కార్యక్రమంలో మల్లేశంగౌడ్,నత్తాగౌడ్,నర్సింలు గౌడ్,పుల్లయ్య,బైరయ్య,భాగిరెడ్డి, జనార్ధన్,గౌడుగు,మల్లయ్య, లచ్చపతి,యాదగిరి లక్ష్మీనారాయణ మాజీ వార్డ్ నెంబర్ గౌడుగు బాలకిషన్ నరేష్ గౌడ్ సాయికుమార్ గౌడ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

వడపర్తి లో ప్రజా పాలన గ్రామ సభ

భువనగిరి, తెలంగాణ సేన : వడపర్తి గ్రామ పంచాయితీ నందు శుక్రవారం ప్రజా పాలన గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం సజావుగా సాగింది ఈ కార్యక్రమంలో రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్ల ,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీ సి ఈ ఓ శోభ రాణి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ భువనగిరి మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణారెడ్డి ఇందిరమ్మ కమిటీ సభ్యులు భువనగిరి ఎంపీ డి ఓ సి హెచ్ శ్రీనివాస్ వడపర్తి స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు ఏ పి ఓ, మాజీ ప్రజా ప్రతినిదులు గ్రామ పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన కౌన్సిలర్ వరలక్ష్మి కనకయ్య

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లోని 3 వ వార్డులో శుక్రవారం నూతనంగా సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి తో కలిసి భూమి పూజ చేసిన కౌన్సిలర్ వరలక్ష్మి కనకయ్య మాట్లాడుతూ 1)గట్టు కొమరయ్య ఇంటి నుండి పూదరి నర్సింలు ఇంటి వరకు 1000000/ అక్షరాలా పది లక్షలు. 2) చెంద లక్ష్మయ్య షాప్ నుండి కోదండరాపల్లి స్కూల్ వరకు 1000000/ అక్షరాలా పది లక్షలు మొత్తం 2000000/- ఇరవై లక్షలా రూపాయలు మున్సిపల్ నిధులుకు ఈరోజు కొబ్బరికాయ కొట్టడం జరిగింది.అని అన్నారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియెద్దీన్,వార్డ్ బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు,యువకులు, మహిళలు, వార్డ్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

జాతీయ ఓటర్ల దినోత్సవం

కొత్తగూడ తెలంగాణ సేన ఉదయం గం. 10.30 ని. లకు 15 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడ మండలములోని కూడలి యందు వివిధ పాటశాలకు చెందిన విద్యార్తులతో కలసి **NVD** ప్రతిజ్ఞ (మానవహారం) కార్యక్రమము కలదు, అందరు హాజరు కాగలరని కోరనైనది. తహశీల్దార్, కొత్తగూడ.

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 125 డివిజన్ గాజులరామారంలో గల సుభాష్ చంద్రబోస్ నగర్ లో 10 సంధల్ ముబారక్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన టీపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీధర్ వర్మ,అహ్మద్,అబీద్, బలరాం వాసిం కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు , అభిమానులు పాల్గొన్నారు.

యోగ్యమైన భూములకు రైతుభరోసా

- తుక్కుగూడ కార్యాలయంలో అన్నదాతలతో కే ఎల్ ఆర్ భేటీ

- నేటి మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన జయప్రదం చేయండి: కిచెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, తెలంగాణ సేన న్యూస్ : యోగ్యమైన భూములకు రైతు భరోసా వచ్చేలా చూడాలని రెవెన్యూ అధికారులను కోరారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. 800 ఎకరాల రావిర్యాల గ్రామ రైతులు... కిచ్చెన్నగారిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన కే ఎల్ ఆర్ %%% మహేశ్వరం నియోజకవర్గంలో ఏ ఒక్కరైతు నష్టపోకుండా చూడాలని కందుకూరు ఆర్డీవోను కోరారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు పేరుతో అసైన్డ్ భూములకు సైతం భరోసా తీసుకున్నారని మండిపడ్డారు. చెరువు కింద సాగు చేసుకుంటున్న పట్టా భూముల రైతులకు సైతం అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పారదర్శకంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా అర్హులందరికీ అందేలా చూస్తామని కిచ్చెన్న భరోసా ఇచ్చారు. గత బీఆర్ఎస్ పాలనలో అనర్హులను లబ్ధిదారులుగా గుర్తిస్తే.. కాంగ్రెస్ ప్రజాపాలనలో ఏరిపారేస్తున్నామని... అందుకే గ్రామ సభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేసినట్లు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. దరఖాస్తుల్లో తప్పులు దొర్లినా... మళ్లీ సరి చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సంక్షేమ పథకాలను పేదలందరికీ నిరంతరం అందించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తుందని కేఎల్ఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు సహా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు

నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన పట్టణం లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల లో "స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజషన్"ఆధ్వర్యంలో ఎఫ్.ఎం.ఎం. సోషల్ సర్వీస్ సొసైటీ వారి సహకారం తో "జాతీయ బాలికల దినోత్సవం, జనవరి-24" సందర్భంగా బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వీహించారు.

ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాంతారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గా పాల్గొన్న స్వయంకృషి సంస్థ నిర్వాహకులు "బెజ్జంకి ప్రభాకర్" బాలికలను ఉద్దేశించి మాట్లాడుచు ఆడపిల్లలు దయర్యంగా సమస్యలను ఎదిరించే స్థాయికి ఎదిగి అన్ని రంగాలలో అభివృద్ధి ని సాధించాలని పిలుపు నిచ్చారు. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్న చూపు చూస్తున్నారు. అంతే కాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రుణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తర్వాత అనేక ఆంక్షలు విధించి వివక్షత కు గురి చేస్తున్నారు. వాటిని నిర్మూలించి, సమాజం ఆడపిల్లలు ఎదుర్కొనే అసమానతల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి భారత దేశంలో ప్రతీ సంవత్సరం 2008 సంవత్సరం నుండి జనవరి, 24 న నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్ కార్యక్రమం లో భాగంగా "జాతీయ బాలికల దినోత్సవం" జరుపుకొంటున్నామని తెలియజేశారు. ఆడపిల్లలు ఆపదలు, సమస్యలు ఎదురైనపుడు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ -1098 మరియు పోలీస్ -100 టోల్ ఫ్రీ నంబర్స్ కి సమాచారం అందించి సహాయం తీసుకొని రక్షణ పొందవచ్చునని తెలిపారు. బాలల అక్రమ రవాణా పై అవగాహన కలిగి అపరిచిత వ్యక్తుల పట్ల నిరంతరం అప్రమత్తం గా ఉండాలని కోరినారు. ఇంకా ఈ కార్యక్రమం లో సిఆర్ పి సుశీల, ఉపాధ్యాయ సిబ్బంది నిర్మల, అరుణకుమారి, వాణి, రాధిక, సుజాత, స్వరూప, పద్మ, శ్రీలత, దివ్య, షేహనాజ్, షౌరి అసంతీనా, వ్యాయమ ఉపాధ్యాయులు స్వామి మరియు బాలికలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిల దోపిడీకి అడ్డుకట్ట వెయ్యాలి.

- సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమా మహేష్.

కుత్బుల్లాపూర్, తెలంగాణ సేన న్యూస్ : సరూర్నగర్ కొత్తపేట్ అల్కానందా హాస్పిటల్ లో వెలుగు చూసిన కిడ్నీ రాకెట్ దోపిడీని నిరసిస్తూ నేడు సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఐడిపిఎల్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో మరియు నగరంలో ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటలు ప్రభుత్వాన్ని గాని, ప్రజలను కానీ లెక్కచేయకుండా ప్రతి చిన్న జబ్బుకు కూడా లక్షల రూపాయలు వసూలు చేసుకుంటూ ప్రజలను ఆర్థికంగా దోపిడీ చేస్తున్న సందర్భాలు నిత్యం మన ముందు కనిపిస్తూనే ఉన్నాయని , కానీ ప్రభుత్వము, ప్రభుత్వ అధికారులు ఆయా ఆస్పత్రి యాజమాన్యాల యాజమాన్యాలపై ప్రేమను చూపిస్తూ, మోసపోయిన ప్రజలను పట్టించుకోవట్లేదని , దాని పర్యావసరమే నేడు సరూర్నగర్ కొత్తపేట్ అలకానంద హాస్పిటల్లో కిడ్నీ దందాల వ్యవహారం వెలుగు చూసిందని,దీనికి ప్రధాన కారణం అధికారుల పర్యవేక్షణ లేకపోవడమేనని సిపిఐ నాయకులు అన్నారు. కావున ఇప్పటికైనా ప్రజలు కానీ, సంస్థలు కానీ ఆసుపత్రిలో జరిగిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే ఇలాంటి సంఘటనలే పునరావృతం అవుతాయని అన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడాల్సినటువంటి వైద్యులు ఆసుపత్రి యాజమాన్యాలు డబ్బు వ్యామోహంతో వారి విధులను నిర్వర్తించకుండా కేవలం డబ్బులు వసూళ్ల పైన దృష్టి పెడుతున్నారని కావున అన్ని ఆసుపత్రులను ప్రభుత్వం నియంత్రణలోకి తీసుకోవాలని సిపిఐ గా డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాలలో ప్రైవేట్ ఆస్పత్రిలో చేస్తున్నటువంటి దోపిడీపై సిపిఐ గా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్,నరసయ్య, ఎమ్మెస్ రెడ్డి, ఇమామ్, వంశీ, సామెల్, యాదగిరి, మహేష్, మజ్జగిరి, కృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వరంలో ఘనంగా జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : జాతీయ బాలికా దినొత్సవం సందర్భంగా నల్లకుంటలో ప్రభుత్వ పాఠశాలలో బాలికలకు క్యారం బోర్డ్స్, చెస్ బోర్డ్స్, షెటిల్ బ్యాట్స్, స్కిప్పింగ్ ఇతర ఆటవస్తువులు బిస్కెట్స్ ప్యాకెట్స్ అందించి ఘనంగా వేడుకలను నిర్వహించాము. ప్రతి కుటుంబంలో బాలికల సాధికారత, భారతదేశానికే సాధికారత అనే నినాదం బలపడినప్పుడే బాలికలు ప్రతి రంగంలో రాణిస్తారు. బాలికలు భయాన్ని వీడి మానసికంగా బలపడినప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొంటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సహా ప్రధానోపాధ్యాయులు నర్సింహా రెడ్డి, ఉపాధ్యాయులు పి. విమల, కవిత, దుర్గ, సుగీత, భాగ్య, ప్రశాంతు, ప్రెసిడెంట్ డాక్టర్. వై. సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని సభ్యులు పాల్గొన్నారు.

తీరు మారని సారు

- బడికి నెలలో రెండుసార్లు

- బోగస్ టీచర్ తో బోధన

- ఈయన జీతం అక్షరాల లక్షన్నర!

- ఆమెకు ఇచ్చేది 6000 మాత్రమే!

రామన్న పేట,తెలంగాణ సేన యాదాద్రి జిల్లా రామన్నపేట మండలంలోని బి.తుర్కపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి ఇటీవల జరిగిన బదిలీలలో పాఠశాలలో చేరినప్పటి నుండి ఇప్పటివరకు నెలలో రెండు సార్లు మాత్రమే హాజరై మిగతా దినములకి సంతకాలు చేస్తూ నెలకు అక్షరాల లక్షన్నర జీతం తీసుకుంటున్నాడు. సంఘానికి నాయకుడని గ్రామస్తులను నమ్మించి , బినామీ టీచర్ ని నియమించి పాఠశాల విధులకు హాజరు కాకుండా హైదరాబాదులో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నాడు. ఈయన తీరుపై స్థానిక యువకులు అధికారులకు ఎన్నో మార్లు విన్నవించినప్పటికీ చూసి చూడనట్లుగా వ్యవహరించారు. ఈ విషయాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ కు వివరించగా నిన్నటి రోజున స్వయంగా తానే పాఠశాలను సందర్శించగా నిరంజన్ రెడ్డి యొక్క నిజ స్వరూపం బయటపడింది. గతంలో ఈయన ఇదే పాఠశాలకు డిప్యూటేషన్ పై వచ్చి సంవత్సరం పాటు పాఠశాల ముఖం చూడకుండా కూడా నెలల జీతం తీసుకునే వారని, ఆ తర్వాత చౌటుప్పల్ మండలంలోని మల్కాపురం గ్రామంలో కూడా పాఠశాల విధులకు హాజరు కాకుండా ఉండడంతో అక్కడ యువకులు మీడియా దృష్టికి తీసుకుపోగా అధికారులు అతన్ని సస్పెండ్ చేసి చేతులు దుల్పుకున్నారు. అధికారులు ఇప్పటికైనా తక్షణమే స్పందించి ఇలాంటి టీచర్ని మా ఊరి నుంచి తొలగించి ఒక మంచి ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

వారానికి 90గంటల పని ఆచరణ సాధ్యం కాదు

ఉద్యోగులు వారానికి 90 గంటలు పని చేయాలని ఇటీవల ఎల్అండ్టి ఛైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యానించారు. గతంలో ఇన్ఫోసిస్ ఛైర్మన్ నారాయణ మూర్తి కూడా వారానికి 70 గంటలు పనిచేయాలని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై పలు కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తీవ్రంగా విమర్శించాయి. ఈ నేపథ్యంలో వర్క్ – లైఫ్‌ని బ్యాలెన్స్ చేసుకోవడానికి రోజుకు 8–9 గంటలు పనిచేస్తే చాలని సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సిఇఓ అదర్ పూనేవాలా చెప్పారు. తాజాగా ఆయన ప్రముఖ మీడియా ఛానెల్ బిజినెస్ ఇండియాతో మాట్లాడుతూ%ా% 'మానవులు ఉత్పాదకతలో 8–9 గంటలే పనిచేయగలరు.

కొన్నిసార్లు అంతకుమించి పని చేయవచ్చు. అంతవరకు బాగానే ఉంటుంది. అప్పుడప్పుడు అదనంగా కొన్నిగంటలు పనిచేసినా ఇబ్బంది ఉండదు. కానీ ప్రతిరోజూ.. మండే టు సండే ఆఫీసులో అలా పనిచేయలేరు. అది ఆచరణ సాధ్యం కానిది' అని అన్నారు. అలాగే పనిగంటలపై ఇటీవల వ్యాఖ్యానించిన సుబ్రహ్మణ్యన్, నారాయణమూర్తిలు కూడా 365 రోజులూ పని చేసి ఉండకపోవచ్చు అని పూనేవాలా అన్నారు. అయితే ఉద్యోగులందరూ కష్టపడి పనిచేయాలన్నదే వారి ఉద్దేశం అయివుండొచ్చునని పూనెవాలా చెప్పారు.

ఉబర్, ఓలా అడ్డగోలు దోపిడీ

హెచ్చు కమిషన్లతో డ్రైవర్ల పొట్టకొడుతూ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఉబర్, ఓలా కంపెనీలు ప్రయాణికులను దోచేస్తున్నాయి. క్యాబ్ సేవలందించే ఈ సంస్థలు వినియోగదారుల ఫోన్ల ధరలను బట్టి చార్జీలను పెంచి వసూలు చేస్తున్నాయి. దీనిపై ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఒకే దూరం, గమ్యస్థానానికి వివిధ రకాల చార్జీలను వసూలు చేయడంపై ఇటీవల భారీగా ఫిర్యాదులు అందాయి. ఈ అడ్డగోలు చార్జీలపై ఓలా, ఉబర్ కంపెనీలకు గురువారం కేంద్రం నోటీసులు జారీ చేసింది. ఆండ్రాయిడ్, ఐఒఎస్ మాత్రమే కాకుండా స్మార్ట్‌ఫోన్ ఖరీదును బట్టి కూడా ఛార్జీల్లో తేడా ఉంటుందని ఫిర్యాదులు అందాయి. క్యాబ్ సర్వీసులను బుక్ చేసుకునేందుకు ఉపయోగించే మొబైల్ మోడల్‌ని బట్టి రైడింగ్ ఛార్జీలను విధించడంపై వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఒకే దూరానికి ఇరు కంపెనీలు వేర్వేరు మొత్తాల్లో ఛార్జీలు విధిస్తున్నట్టు కూడా ఫిర్యాదులు వచ్చాయని వినియోగదారుల మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ వ్యవహారంపై ఇండియా కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) సైతం చర్యలకు ఉపక్రమించింది. ఒకే రకమైన సర్వీసుకు రెండు రకాల ధరలను ఎలా నిర్ణయించారనే దానిపై వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. ఛార్జీల్లో పారదర్శకత తీసుకునేందుకు సమగ్రమైన వివరణతో కూడిన రిపోర్ట్ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం చేసింది. రైడ్ బుకింగ్ సమయంలో ఒక ధర.. గమ్యస్థానానికి చేరాక మరో ధరను వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉబర్ కంపెనీ ఫోన్ మోడల్‌ని బట్టి కాకుండా అందులోని బ్యాటరీ పర్సంటేజీ ఆధారంగా కూడా ఛార్జీల్లో వ్యత్యాసం ఉంటుందని ఇటీవల ఓ ప్రయాణికుడు సోషల్ మీడియాలో ఆందోళన వ్యక్తం చేశారు. పలు ఆండ్రాయిడ్, ఐఒఎస్ ఫోన్‌ల ద్వారా పరిశీలిం చిన తర్వాత కూడా దీన్ని నిర్ధారించినట్టు పేర్కొన్నారు. ప్రయాణికుల నుంచి దోపిడిని ప్రభుత్వం ఏమాత్రం సహించదని వినినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వీలైనంత త్వరగా నివేదిక సమర్పించాలని సిసిపిఎను ఆదేశించామన్నారు.

సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ఎస్ 25 సిరీస్

సామ్‌సంగ్ తమ తాజా గెలాక్సీ ఎస్ 25 అల్ట్రా , గెలాక్సీ ఎస్ 25ం మరియు గెలాక్సీ ఎస్ 25 స్మార్ట్‌ఫోన్‌లను ఈరోజు విడుదల చేసినట్లు వెల్లడించింది, ఇవి సామ్‌సంగ్ ఇప్పటివరకు సృష్టించిన అత్యంత సహజమైన, సందర్భోచిత మొబైల్ అనుభవాలతో నిజమైన ఏఐ సహచరుడిగా నూతన ప్రమాణాన్ని నెలకొల్పాయి."గొప్ప ఆవిష్కరణలు వాట్రి వినియోగదారుల ప్రతిబింబం, అందుకే ప్రతి ఒక్కరూ తమ పరికరాలతో మరింత సహజంగా, సౌకర్యవంతంగా సంభాషించడానికి సహాయపడటానికి మేము గెలాక్సీ ఏఐ ని అభివృద్ధి చేసాము, అదే సమయంలో వారి గోప్యత సురక్షితంగా ఉందని విశ్వసిస్తున్నాము" అని సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ మొబైల్ ఎక్స్పీరియన్స్ బిజినెస్ ప్రెసిడెంట్, హెడ్ టిఎం రోహ్ అన్నారు.

"గెలాక్సీ ఎస్ 25 సిరీస్ ఏఐ –ఇంటిగ్రేటెడ్ ఓఎస్ కి తలుపులు తెరుస్తుంది, ఇది మనం టెక్నాలజీని ఎలా ఉపయోగిస్తాము మరియు మన జీవితాలను ఎలా గడుపుతాము అనే వాటిని మారుస్తుంది" అని అన్నారు వన్ యుఐ 7తో వచ్చే మొదటి స్మార్ట్‌ఫోన్,గెలాక్సీ %ా%25 సిరీస్. ఇది సామ్‌సంగ్ యొక్క ఏఐ –ఫస్ట్ ప్లాట్‌ఫామ్, ఇది ఏఐ –ఆధారిత వ్యక్తిగతీకరించిన మొబైల్ అనుభవాలను సాధ్యం చేస్తూ అత్యంత సహజమైన నియంత్రణలను అందించడానికి రూపొందించబడింది. మల్టీమోడల్ సామర్థ్యాలతో కూడిన ఏఐ ఏజెంట్లు గెలాక్సీ ఎస్ 25 సహజంగా అనిపించే పరస్పర చర్యల కోసం టెక్స్ట్, ప్రసంగం, చిత్రాలు మరియు వీడియోలను అర్థం చేసుకోవడానికి వీలు కల్పిస్తాయి.గెలాక్సీ ఎస్ 25 సహజ భాషా అవగాహనలో ఒక పురోగతిని కూడా సూచిస్తుంది, ఇది రోజువారీ పరస్పర చర్యలను సులభతరం చేస్తుంది. కమ్యూనికేషన్, ఉత్పాదకత మరియు సృజనాత్మకత – గూగుల్ యొక్క సర్కిల్ టు సెర్చ్, కాల్ ట్రాన్స్‌క్రిప్ట్, రైటింగ్ అసిస్ట్ మరియు డ్రాయింగ్ అసిస్ట్ – కోసం గెలాక్సీ ఏఐ యొక్క ప్రసిద్ధ సాధనాలకు అప్‌గ్రేడ్‌ల శ్రేణిని గెలాక్సీ ఎస్ 25 సిరీస్ తెస్తుంది. గెలాక్సీ ఎస్ 25 సిరీస్‌తో, మీరు తదుపరి దశల కోసం సందర్భోచితంగా అవగాహన ఉన్న సూచనలతో చర్య తీసుకోదగిన శోధనలను కూడా చేయవచ్చు.

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,413 కోట్లు

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,413 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.1,379 కోట్లు) తో పోల్చితే లాభం 2 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ రూ.7,215 కోట్ల నుంచి రూ.8,359 కోట్లకు పెరిగింది. ఇటీవల కొనుగోలు చేసిన నికోటిన్ రీప్లేసమెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) వ్యాపారంతో పాటు కొత్త ఔషధాల విడుదల, నిర్వహణపరంగా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవటం ఎంతగానో కలిసి వచ్చిందని డాక్టర్ రెడ్డీస్ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ తెలిపారు. అంతేకాకుండా అఫర్డబిలిటీ, నవకల్పనలపై దృష్టి పెట్టడం ద్వారా రోగుల అవసరాలను తీర్చేందుకు తాము కట్టుబడి ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్ఆర్‌టీ వ్యాపారం నుంచి అదనంగా రూ.605 కోట్ల రెవెన్యూ రావటం కలిసివచ్చిందని కంపెనీ తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో ఉత్తర అమెరికా వ్యాపారం స్వల్పంగా 1 శాతం వృద్ధితో రూ.3,349 కోట్ల నుంచి రూ.3,383 కోట్లకు పెరిగిందని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. మరోవైపు యూరప్ వ్యాపారం ఏకంగా 143 శాతం వృద్ధితో రూ.497 కోట్ల నుంచి రూ.1,210 కోట్లకు పెరిగినట్లు పేర్కొంది. ఇదే సమయంలో భారత్‌లో అమ్మకాలు కూడా రూ.1,180 కోట్ల నుంచి రూ.1,346 కోట్లకు పెరగగా వర్ధమాన మార్కెట్లలో విక్రయాలు 12 శాతం పెరుగుదలతో రూ.1,436 కోట్లకు చేరుకున్నాయని తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో ఆర్ అండ్ డీ వ్యయాలు రూ.665.80 కోట్లుగా ఉన్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. కంపెనీ మొత్తం ఆదాయాల్లో ఇది 8 శాతానికి సమానమని పేర్కొంది. కంపెనీకి చెందిన ప్రస్తుత ఔషధాల పోర్టుఫోలియోను మరింత పటిష్ఠం చేయటంతో పాటు కీలకమైన వ్యాపారాలైన జెనరిక్స్, ఏపీఐలపై మరింత దృష్టి పెట్టనున్నట్లు డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఎంవీ నరసింహం తెలిపారు. అంతేకాకుండా వ్యూహాత్మక విభాగాలైన కన్స్యూమర్ హెల్త్, ఇన్నోవేటివ్ ఉత్పత్తులు (డిజిటల్ థెరాప్యుటిక్స్, ప్రత్యేకమైన మాలిక్యూల్స్), బయోసిమిలర్స్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు చెప్పారు. ఇందుకు తగ్గట్టుగానే ఆర్ అండ్ డీపై పెట్టుబడులు పెంచుకుంటూ వస్తున్నట్లు నరసింహం తెలిపారు.

డాలర్‌తోనే రూపాయికి కష్టాలు



డాలర్ మారకం రేటు పుంజుకోవడం వల్లే.. మన రూపాయి మారకం రేటు క్షీణిస్తోందని ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు డాలర్ మారకం రేటును మరింత పెంచుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు ఆర్‌బీఐ జోక్యం చేసుకోవడం ఏమాత్రం మంచిది కాదన్నారు. అలా చేస్తే మన ఎగుమతులూ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డాలర్–రూపీ మారకం రేటులో మరీ తీవ్రమైన ఆటుపోట్లు ఏర్పడితే తప్ప ఆర్‌బీఐ జోక్యం చేసుకోవడం ఏమాత్రం మంచిది కాదని రాజన్ స్పష్టం చేశారు. రాజకీయంగా పటిష్ఠ స్థితిలో ఉన్న కేంద్రంలోని ఎన్‌డీఏ 3.0 ప్రభుత్వం రాబోయే కేంద్ర బడ్జెట్లో వృద్ధిని, ఉపా?ధి కల్పనను ఉత్తేజితం చేయగల, సంక్లిష్టమైన సంస్థాగత సంస్కరణలకు నడుం బిగించాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు సూచించారు. ఆర్థిక వ్యవస్థను సుస్థిర వృద్ధి బాటలో నడపడమే బడ్జెట్ ప్రాథమిక లక్ష్యం కావాలన్నారు. కేవలం వృద్ధిని పెంచితే చాలదని, సమాజంలో అసమానతలు తగ్గించాలన్నారు. ప్రధానంగా దేశ జనాభాలో దిగువ అర్ధభాగం భారీ వినియోగ శక్తి వృద్ధికి చోదకంగా ఉంటుందని చెప్పారు. వారు మరింతగా సంపాదించినట్టయితే మరింతగా వ్యయం చేస్తారని, ఫలితంగా ఉత్పత్తి పెరిగి మరిన్ని ఉపా ధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని సుబ్బారావు చెప్పారు.

బడ్జెట్‌లో వేతన జీవులకు గుడ్‌న్యూస్..

వేతనజీవులూ.. మీకోసమే ఈ వార్త. కేంద్ర బడ్జెట్ అనగానే, మనకేమీ ఉండదని రొటీన్‌గా అనుకోకండి. ఏమో గుర్రం ఎగరావచ్చు అనుకోండి. ఎందుకంటే, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ధమాకా న్యూస్ రెడీ చేస్తున్నారు. బడ్జెట్‌కు ముందే హల్వా టేస్ట్.. మనం కూడా చూడొచ్చని ఢిల్లీ నుంచి కథనాలు గుప్పుమంటున్నాయి. ఫిబ్రవరి ఒకటోతేదీన కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు గుడ్‌న్యూస్ వస్తుందా? ఇప్పుడే ఢిల్లీ నుంచి మన గల్లీదాకా ఇదే ఇంట్రస్టింగ్ న్యూస్. మధ్యతరగతిపై ధరలభారాన్ని తగ్గించి, వినిమయాన్ని పెంచేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కసరత్తు చేస్తున్నారు. ఏడాది మీ వేతన సంపాదన 10 లక్షల వరకు ఉంటే మీరు ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలోకి రాకపోవచ్చు. అదే సందర్భంలో వార్షికాదాయం 15 నుంచి 20 లక్షల రూపాయలు ఉన్నవారికి 25 శాతం ట్యాక్స్ విధించే యోచన కూడా చేస్తున్నారు. ఈ రెండు నిర్ణయాలను బడ్జెట్‌లో ప్రకటిస్తే, సర్కారీ ఖజానాపై 50వేల కోట్ల నుంచి నుంచి లక్ష కోట్ల రూపాయల భారం పడుతుందని లెక్కలు కూడా తీశారు. మొత్తానికి కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్ విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతారకైతే ఏడాదికి ఏడు లక్షల రూపాయల వరకు ఆదాయం ఉన్నవారు ట్యాక్స్ పరిధిలోకి రారు. ఈ పరిమితిని 10 లక్షల రూపాయల పెంచే సాధ్యాసాధ్యాలను లెక్కలమంత్రి అన్వేషిస్తున్నారు. వాస్తవానికి ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రవేశపెట్టే బడ్జెట్లలో మధ్యతరగతికి ఇన్‌కమ్‌ట్యాక్స్ విషయంలో పెద్దగా గుడ్‌న్యూస్‌లు ఉండవు. కానీ దేశంలో ప్రస్తుతం ధరలు పెరుగుతున్నాయి. మధ్యతరగతి ప్రజలు ఆదాయం కూడా పెద్దగా పెరగడం లేదు. ప్రజల్లో ఉన్న ఈ అసంతృప్తిని చల్లార్చేందుకు, మార్కెట్‌లో డిమాండ్‌ను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా కసరత్తులు చేస్తున్నట్లు గట్టిగానే ప్రచారం జరుగుతోంది. అయితే ఫిబ్రవరి ఒకటి విడుదల ఎలా ఉంటుందన్నది ఇప్పుడు అసలు పాయింట్.

వంద కోట్ల ఓటర్లకు చేరువలో భారత్

న్యూఢిల్లీ : దేశంలో ఓటర్ల సంఖ్య వంద కోట్లకు చేరువ కానుందని ఎన్నికల సంఘం (ఇసి) వెల్లడించింది. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల కంటే ప్రస్తుతం ఓటర్ల సంఖ్య పెరిగిందని ఇసి వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో 96.88 కోట్ల ఓటర్లు వుండగా, ఆ సంఖ్య ఇప్పుడు 99.1 కోట్లకు పెరిగిందని ఇసి లెక్కలు వెల్లడిస్తున్నాయి. జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 18- 29 సంవత్సరాల మధ్య వయసు గల ఓటర్లు 21.7 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని ఇసి ఈ ప్రకటనలో తెలిపింది. ఇటీవలి కాలంలో ఎన్నికల లింగ నిష్పత్తి కూడా పెరిగిందని ఇసి పేర్కొంది. 2024లో 948 పాయింట్లుగా ఉన్న లింగ నిష్పత్తి 2025కల్లా 954కి చేరింది. ఆరుశాతం మేర లింగనిష్పత్తి పెరిగిందని ఇసి తెలిపింది.

కాగా, 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పాటైంది. ఇసి వ్యవస్థాయపక దినోత్సవం సందర్భంగా.. ప్రతి సంవత్సరం జనవరి 25న ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నాము. వచ్చే నెల ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్నికల షెడ్యూల్‌ని ప్రకటించే ఒకరోజు ముందు (జనవరి 6వ తేదీ) భారత్‌లో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, త్వరలోనే వంద కోట్ల ఓటర్లు కలిగిన దేశంగా భారత్ రికార్డు సృష్టిస్తుందని చీఫ్ ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు.

నేతాజీ అస్థికలు తెప్పించండి

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్‌ఫౌజ్ స్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణంపై అనుమానాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన అస్థికలను భారత్‌కు తీసుకొచ్చి, వాటికి డీఎన్ఏ పరీక్ష నిర్వహించాలన్న డిమాండ్ పెరుగుతోంది. నేతాజీ కుటుంబ సభ్యులు కూడా పదేపదే ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేస్తున్నారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అస్థికలకు డీఎన్ఏ పరీక్ష నిర్వహిస్తే విమాన ప్రమాదంలో చనిపోయింది నేతాజీయా కాదా అనే విషయం తేలిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం నేతాజీ అస్థికలను జపాన్‌లోని రెంకోజీలో ఉన్న బౌద్ధ దేవాలయంలో ఓ కలశంలో భద్రపరిచారు. అనేక దశాబ్దాలుగా అవి అక్కడే ఉన్నాయి. అవి నేతాజీవేనని కొందరు భావిస్తుండగా మరి కొందరు కావని అంటున్నారు. ఇప్పుడు తైవాన్‌గా పిలుస్తున్న ప్రాంతంలో 1945 ఆగస్ట్ 18న జపాన్ సైనిక విమానం కూలిపోయింది. ఆ ప్రమాదంలో నేతాజీ మరణించారని కొందరు, కాదని కొందరు వాదిస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు నుండే నేతాజీ అదృశ్యమయ్యారు. దీనిపై పది జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తులు జరిగాయి. ఇప్పుడు వాటి నివేదికలు న్యూఢిల్లీలోని నేషనల్ ఆర్కివ్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం తైవాన్‌లోని తైహెూకూలో ఉన్న జపాన్ సైనిక వైమానిక స్థావరంలోని ఆస్పత్రిలో బోస్ చనిపోయారని ఆ దర్యాప్తు నివేదికలు ధృవీకరించాయి.

అయితే సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి మనోజ్ కుమార్ ముఖర్జీ నేతృత్వంలోని కమిటీ మాత్రం ఇందుకు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఇది నేతాజీ మరణంపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన చిట్టచివరి విచారణ కమిటీ. 2005 నవంబరులో కమిటీ తన నివేదికను సమర్పించింది. బోస్ చనిపోయిన మాట నిజమే కానీ అందరూ చెబుతున్నట్లు విమాన ప్రమాదంలో కాదని కమిటీ తెలిపింది. జపాన్ దేవాలయంలో ఉన్న అస్థికలు నేతాజీవి కావని స్పష్టం చేసింది. అయితే కమిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. తమకు జపాన్ బౌద్ధ దేవాలయ మత గురువులు సహకరించలేదని, తక్కువగా కాలిపోయిన కొన్ని ఎముక ముక్కలను సేకరించి డీఎన్ఏ పరీక్ష నిర్వహించేందుకు అనుమతించలేదని కమిటీ తన నివేదికలో ప్రస్తావించింది.

ఐదేళ్లలో నిరుద్యోగాన్ని నిర్మూలిస్తాం

న్యూఢిల్లీ : వచ్చే ఐదేళ్లలో ఢిల్లీలో నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. 'యువతకు ఉపాధి కల్పించడమే మా ప్రాధాన్యత. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు మా బృందం ఒక ప్రణాళికను రూపొందిస్తోంది. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం రెండేళ్లలో 48 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. అలాగే, మూడు లక్షలకు పైగా ప్రైవేటు రంగ ఉద్యోగాలను కల్పించాం. ఉపాధి ఎలా సృష్టించాలో మాకు బాగా తెలుసు. ప్రజల మద్దతుతో మళ్లీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఢిల్లీలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తాం' అని ఆయన పేర్కొన్నారు. ఆప్ పాలనలో ఢిల్లీని డంపింగ్ యార్డులా మార్చేశారని, 24 గంటల విద్యుత్ అందించడంలేదంటూ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇటీవల చేసిన ఆరోపణలను కేజ్రీవాల్ తిప్పికొట్టారు. గురువారం పశ్చిమ ఢిల్లీలోని హరినగర్‌లో ఆప్ అభ్యర్థి తరపున నిర్వహించిన ప్రచార సభలో కేజ్రీవాల్ మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లో కరెంటు కోతల మాటేమిటని? యోగిని ఆయన ప్రశ్నించారు. 'నేను చాలా మందిని అడిగా. ఢిల్లీలో 24 గంటలూ విద్యుత్ అందుబాటులో ఉందని చెబుతున్నారు. ఆప్ సర్కార్ ఢిల్లీలో పదేళ్లుగా ఉంది. ఐదేళ్లలోనే 24 గంటల నిరంతర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురాగలిగాం. యుపిలో బిజెపి 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం రోజుకు ఎన్ని గంటలు విద్యుత్ అందిస్తోందో? యోగిజీ పరిశీలించుకోవాలి' అని కేజ్రీవాల్ అన్నారు.

ఇన్‌కాయిస్‌కు నేతాజీ 'ఆప్ద్ ప్రబంధన్' పురస్కారం

న్యూఢిల్లీ: విపత్తుల నివారణకు నిస్వార్థ సేవలందించే పౌరులకు, సంస్థలకు కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ అందజేసే ప్రతిష్టాత్మక నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'ఆప్ద ప్రబంధన్' పురస్కారం ఈ ఏ:డాదికి గాను హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓసియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఇన్‌కాయిస్)కు లభించింది. ఈ పురస్కారం కింద రూ.51 లక్షల నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు. నేతాజీ జయంతి సందర్భంగా గురువారం నాడు కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ ఈ మేరకు ప్రకటించింది. ఈ పురస్కారానికి గతేడాది జులై నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా ..295 నామినేషన్లు వచ్చినట్లు హెూంశాఖ వెల్లడించింది. వీటిలో ఇన్‌కాయిస్‌ను పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపింది. హైదరాబాద్‌లో 1999లో స్థాపించిన ఇన్‌కాయిస్ సముద్ర సంబంధిత ప్రమాదాల గురించి ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో ప్రఖ్యాతిగాంచింది. ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సెంటర్ (ఐటిఇడబ్ల్యుసి) వ్యవస్థతో 10 నిమిషాల్లోనే ఈ సంస్థ సునామీ హెచ్చరికలను అందజేయగలదు. భారత్‌తో పాటు 28 దేశాలకు సేవలందిస్తోంది. సునామీ సర్వీస్ ప్రొవైడర్ గా యునెస్కో సైతం ఇన్‌కాయిస్‌ను గుర్తించింది. భూకంప కేంద్రాలు, అలల తీవ్రత, ఇతర సముద్ర సెన్సార్‌ల నెట్‌వర్క్‌కు ఈ సంస్థ సమాచార సేవలందిస్తోంది. 2013 ఫైలిన్, 2014 హుద్హుద్ తుఫాను సమయంలో అందించిన సలహాలు, సహాయంతో సకాలంలో ప్రజల తరలింపు, తీరప్రాంత ప్రమాదాలను తగ్గించడంలో కీలక పాత్రం పోశించింది. సముద్రంలో గల్లంతైన వ్యక్తులు, వస్తువులను గుర్తించడంలో ఇండియన్ కోస్ట్ గార్డ్, నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులకు సహకారం అందించేందుకు ప్రత్యేకంగా సెర్చ్ అండ్ రెస్క్యూ ఎయిడెడ్ టూల్ (సరత్)ని అభివృద్ధి చేసి ఇన్‌కాయిస్ సేవలందిస్తోంది.

మీ వాదనలకు ముగింపు ఉండదా ?

న్యూఢిల్లీ: 2020 అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, మరో ఆరుగురు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ ప్రాసిక్యూషన్ అదే పనిగా సుదీర్ఘ వాదనలు విన్పించడాన్ని ఢిల్లీ హైకోర్టు తప్పు పట్టింది. ముగింపు లేని వాదనలను తాను వినబోనని తేల్చి చెప్పింది. ఇమామ్ చేసినట్లుగా చెబుతున్న ప్రసంగాలను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ ప్రసాద్ చదవడం ప్రారంభించగానే జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ షలీందర్ కౌర్‌తో కూడిన బెంచ్ అడ్డు తగిలింది. 'మీ సుదీర్ఘ వాదనలు ఇంకా ఎంత కాలం కొనసాగుతాయి?' అని ప్రశ్నించింది. 'మీ వాదనలను ఆపేయండి. అవి ఇప్పుడే ఆగిపోవాల్సిన అవసరం ఉంది. ముగింపు అనేది లేకుండా అవి కొనసాగకూడదు. మేము మీకు ఎక్కువ సమయం ఇవ్వలేము' అని హైకోర్ట్ బెంచ్ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఢిల్లీ పోలీసుల తరపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కూడా ఈ కేసులో తన వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. 'మీరు ఇప్పుడే వాదనలు ముగించాలి. అవి ముగింపు లేకుండా కొనసాగకూడదు' అని జస్టిస్ చావ్లా సూచించారు. అనంతరం తదుపరి విచారణను ఫిబ్రవరి 12వ తేదీకి వాయిదా వేశారు. నాలుగు సంవత్సరాలకు పైగా జైలు జీవితం గడుపుతున్న ఖలీద్, ఇమామ్, మహమ్మద్ సలీం ఖాన్, షిఫా ఉర్ రెహమాన్, షాదాబ్ అహ్మద్, అథర్ ఖాన్, ఖలీద్ సైఫీ, గుల్ఫిషా ఫాతిమా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు విచారణ జరుపుతోంది. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని సమర్థించే వారికి, వ్యతిరేకించే వారికి మధ్య 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో ఘర్షణలు చెలరేగాయి. దీనికి సంబంధించి నిందితులపై పలు చట్టాల కింద కేసులు నమోదు చేశారు. ఢిల్లీ అల్లర్లలో 53 మంది చనిపోగా వందలాది మంది గాయపడ్డారు.

ప్రతీకార చర్యలకు దిగితే తీవ్ర పర్యవసానాలే

దావోస్ : వాణిజ్య యుద్ధాల వల్ల అంతర్జాతీయ అభివృద్ధికి తీవ్రమైన పర్యవసానాలు కలుగుతాయని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) డైరెక్టర్ జనరల్ నాగొజి ఒకొంజొ హెచ్చరించారు. గురువారం ఇక్కడ జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) సమావేశాల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులపై చర్చించేందుకు ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 25 శాతం లేదా 60 శాతం టారిఫ్‌లు విధిస్తూ మనం ప్రతీకార చర్యలకు పాల్పడినట్లైతే, మళ్లీ 1930ల కాలానికి వెళ్లిపోతామని, రెండంకెల్లో జిడిపి నష్టాలను చవి చూస్తామని ఆయన వ్యాఖ్యానించారు. అటువంటి పరిస్థితులు అందరికీ తీవ్ర వినాశనాన్ని కలిగిస్తాయన్నారు. అందుకు మూల్యం చెల్లించక తప్పదన్నారు. కృత్రిమ మేధస్సు, సంస్కరణలపై తక్షణమే కార్యాచరణ చేపట్టాలని పలు దేశాలకు చెందిన నేతలు పిలుపునిచ్చారు. తప్పుడు సమాచార వ్యాప్తిని, సైబర్ వేధింపులను అణచివేసేందుకు యురోపియన్ యూనియన్ వ్యాప్తంగా సోషల్ మీడియా పాలనలో సంస్కరణలు రావాలని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ కోరారు. రాబోయే కాలంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో వుంచుతూ 6 నుండి 8 శాతం ఆర్థికాభివృద్ధి రేటును భారత్ కొనసాగిస్తుందని కేంద్ర రైల్వే, సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం చెప్పారు. గురువారం ఇక్కడ జరుగుతున్న డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక ప్రణాళికకు సర్వతోముఖాభివృద్ధి అనేది మూల స్తంభంగా వుంటుందని అన్నారు. దీనికి తోడు తయారీ, సేవలు, చట్టాల సరళీకరణ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి కొనసాగిస్తూనే వుండాల్సి వుంటుందన్నారు.

అమెరికాలో 600 బిలియన్ల డాలర్ల పెట్టుబడులు

రాబోయే నాలుగేళ్ళ కాలంలో అమెరికాలో 600 బిలియన్ల డాలర్ల (దాదాపు 51.87 లక్షల కోట్ల రూపాయలు) పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్లు సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ గురువారం తెలిపారు. అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్‌తో ఆయన ఫోన్లో మాట్లాడిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, తన మొదటి విదేశీ పర్యటనగా బ్రిటన్‌లో పర్యటించడానికి ట్రంప్ యోచిస్తున్నారు. 2017లో ట్రంప్ ఇలాగే పర్యటించారు. చమురు సంపన్న గల్ఫ్ దేశాల పాలకులతో అమెరికా సంబంధాలు మెరుగైన రీతిలో వుండేందుకు తాము ప్రాధాన్యత ఇస్తామని ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం చెప్పింది. అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను మెరుగుపరుచుకోవాలని తాము కూడా భావిస్తున్నట్లు సౌదీ యువరాజు తెలిపారు. అయితే ఈ పెట్టుబడులు ఏ ఏ రంగాల్లో ఎక్కడెక్కడ పెడతారు, వాణిజ్య వివరాలు వంటివి ఆయననే జారీ చేసిన ప్రకటనలో వెల్లడించలేదు. ఇటీవల కాలంలో సౌదీ చమురు ఎగుమతులపై అమెరికా ఎక్కువగా ఆధారపడుతూ వస్తోంది. అలాగే అమెరికా తయారీ ఆయుధాలు, రక్షణ వ్యవస్థలపై సౌదీ అరేబియా ప్రధానంగా ఆధారపడుతోంది. బహుశా రక్షణ రంగంలోకూడా పెట్టుబడులు పెట్టే అవకాశాలు వుండొచ్చునని భావిస్తున్నారు. కాగా ఈ ఫోన్‌కాల్‌పై వైట్‌హౌస్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

క్యూబాపై మళ్లీ తీవ్రవాద ముద్ర

వాషింగ్టన్ : క్యూబాను తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల జాబితాలోకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్ళీ చేర్చారు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే పరిస్థితి తారుమారైంది. ఒక వారం క్రితం క్యూబాను ఈ జాబితా నుండి తొలగిస్తూ ఎన్నాళ్ళగానో అందరూ ఎదురుచూస్తున్న నిర్ణయాన్ని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్నారు. కానీ ట్రంప్ పగ్గాలు చేపట్టగానే మళ్ళీ ఆ నిర్ణయాన్ని రద్దు చేశారు. క్యూబాపై పలు రకాలుగా ఏకపక్ష ఆంక్షలు విధించడంతో ఒక రకంగా అంతర్జాతీయ వాణిజ్య పరిధి నుండి ఆ దేశం బయటకు వచ్చేసింది. ఈ కారణంగా ఇంధనం వంటి కీలక ఉత్పత్తుల కొరత చాలా తీవ్రంగా వుంటోంది. ఆంక్షలు సహా ఇటువంటి చర్యలతో క్యూబా అనేక మానవతా సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ట్రంప్ తీసుకున్న చర్యను క్యూబా అధ్యక్షుడ డియాజ్ కానెల్ తీవ్రంగా విమర్శించారు. అహంకారపూరితమైన చర్యగా అభివర్ణించారు. వాస్తవంతో ఏ మాత్రం సంబంధం లేకుండా తీసుకున్న చర్యని వ్యాఖ్యానించారు. తన ఆధిపత్యం కోసం క్యూబాపై చాలా క్రూరమైన రీతిలో ఆర్థిక యుద్ధం జరపాలని, దాన్ని ఇంకా బలోపేతం చేయాలన్నది ట్రంప్ లక్ష్యమని క్యూబా అధ్యక్షుడు పేర్కొన్నారు. నిండా అహంకారంలో మునిగిపోయారని ట్రంప్‌పై క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తీవ్రంగా విమర్శించారు. క్యూబన్ల కుటుంబాలను శిక్షించాలన్నది ఆయన అభిమతంగా వుందన్నారు. అయితే ఇలాంటి చర్యల వల్ల క్యూబన్ల కృత నిశ్చయాలను నీరు గార్చలేరని, అంతిమంగా విజయం తమదేనని రొడ్రిగజ్ స్పష్టం చేశారు. లాటిన్ అమెరికా, కరేబియా వ్యాప్తంగా సామాజిక, రాజకీయ సంఘాల వేదిక అల్బా మూవ్‌మెంట్స్ కూడా ఈ చర్యలను తీవ్రంగా ఖండించింది. సాంప్రదాయేతర యుద్ధ విధానాలకు పాల్పడుతూ ఊచకోత విధానంలో భాగంగా ఇటువంటి చర్యలు తీసుకుంటున్నారని ఆ వేదిక విమర్శించింది. అల్బా-టిసిపి కూడా ట్రంప్ చర్యను తీవ్రంగా వ్యతిరేకించింది.

మాజీ సిఎం హరీశ్ రావత్ ఓటు గల్లంతు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ మాజీ సిఎం హరీశ్ రావత్ పేరు ఓటరు జాబితాలో గల్లంతయింది. ఈ విషయాన్ని అధికారులే స్వయంగా వెల్లడించారు. నేడు ఆ రాష్ట్రంలో 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 43 మున్సిపాల్టీలు, 46 నగర పంచాయితీలకు పోలింగ్ జరుగుతోంది. ఈ ఎన్నికల్లో ఓటేసేందుకు ఆ రాష్ట్ర మాజీ సీఎం హరీశ్ రావత్ డెహ్రాడూన్‌లో ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కి వెళ్లారు. అయితే అక్కడ ఓటరు లిస్టులో ఆయన పేరు గల్లంతయింది. దీంతో ఆయన ఓటు వేయలేకపోయారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో డెహ్రాడూన్‌లోని నిరంజన్‌పుర్ ఏరియా నుంచి ఆయన ఓటు వేశారు. కానీ ఈసారి మాత్రం ఆ ప్రదేశం నుంచి ఆయన ఓటు వేయలేకపోయారు. కాగా, ఓటర్ల జాబితా నుంచి పేరు గల్లంతు అయిన అంశంపై హరీశ్ రావత్ స్పందించారు. ఈరోజు ఉదయం నుంచి ఓటు వేసేందుకు తాను నిరీక్షిస్తున్నానని, కానీ పోలింగ్ స్టేషన్‌లో తన పేరు లేకపోవడంతో ఓటు వేయలేకపోయానని అన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తాను ఇక్కడి నుంచే ఓటేశానని.. ఈకొద్ది కాలంలోనే ఓటరు లిస్టులో తన పేరును బిజెపి మాయం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే, కంప్యూటర్ సర్వర్లు మొరాయిస్తున్నట్లు ఈసీ చెప్పిందని హరీశ్ రావత్ చెప్పారు.

క్యూబాపై మళ్లీ తీవ్రవాద ముద్రగ

కాలిఫోర్నియా : అమెరికాలోని సంపన్నుల ప్రాంతమైన లాస్‌ఏంజెల్స్‌లో మూడు వారాల క్రితం చెలరేగిన దావానలం ఇంకా పూర్తిగా శాంతించక మునుపే మరో ప్రాంతంలో తాజాగా కార్చిచ్చు మొదలైంది. గాలులు కూడా ఉధృతంగా వీస్తుండడంతో మంటలు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయని అధికారులు తెలిపారు. విమానాల ద్వారా వాటర్ బాంబులను జార విడుస్తూ మంటల ఉధృతి తగ్గించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా, ఈ మంటల ముప్పుతో దాదాపు 50వేల మందిని ఇళ్ళను ఖాళీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. లాస్‌ఏంజెల్స్‌కు ఉత్తరంగా పర్వత ప్రాంతాల్లో కాస్టాటిక్ సరస్సుకు సమీపంలో మంటలు చెలరేగుతున్నాయి. బుధవారం ఉదయం ప్రాంభమైన ఈ మంటలు ఒక రోజులోనే దాదాపు 9వేల ఎకరాలను దగ్ధం చేశాయి.

ప్రముఖ రిక్రియేషన్ ఏరియా అయిన కాస్టాటిక్ సరస్సుకు సమీపంలో దాదాపు 41 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చెట్లు, పొదలు పూర్తిగా మాడి మసైపోయాయి. గత మూడు వారాలుగా కార్చిచ్చు చెలరేగుతున్న ఈటన్, పాలిసాడ్స్ ఏరియాలకు ఈ ప్రాంతం 64కిలోమీటర్ల దూరంలో వుంది. మరోవైపు పెద్ద ఎత్తున దాదాపు 4వేల మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు హెూరాహెూరీ శ్రమిస్తున్నారు. ఇంత చేస్తే 14శాతం మేరా మంటలను అదుపు చేయగలిగారు. ఈ పరిస్థితుల్లో లాస్‌ఏంజెల్స్, వెంటురా కౌంటీల్లో శుక్రవారం ఉదయం 10గంటల వరకు రెడ్ ఫ్లాగ్ హెచ్చరికలు జారీ చేశారు. 5వ నెంబరు అంతర్రాష్ట్ర రహదారిలో కొన్ని భాగాలను మూసివేశారు. పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత తెరుస్తామని లాస్‌ఏంజెల్స్ కౌంటీ షరీఫ్ రాబర్ట్ లూనా చెప్పారు.

నెలరోజుల పాటు టీ మానేస్తే ..

మన శరీరంలో జరిగేది ఇవే.. !

టీ, చాయ్... మన దేశంలో చాలా మంది దీనికి బానిసలుగా ఉన్నారు. చాలా మంది తియ్యటి, కమ్మటి, ఘుమ ఘుమలాడే టీ తాగడానికి ఇష్టపడతారు. ఉదయం నిద్రలేవగానే దాదాపు అందరూ చేసే మొదటి పని ఇదే. టీ తాగగానే ఎక్కడ లేని కొత్త ఎనర్జీ వచ్చినట్టుగా ఫీల్ అవుతుంటారు. ఆ శక్తితో రోజంతా ఉత్సాహంగా పనిచేస్తుంటారు. అయితే, ఈ టీలో అధిక మొత్తంలో చక్కెర ఉంటుంది. ఇది ఆరోగ్య సమస్యలను కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఒక నెలరోజుల పాటు టీ తాగటం మానేస్తే మీ శరీరంలో ఎలాంటి మార్పులు వస్తాయో గమనించాలని చెబుతున్నారు. ఒక నెల పాటు స్వీట్ టీ తాగకపోవడం వల్ల మీ బరువు గణనీయంగా తగ్గుతుంది. ఎందుకంటే స్వీట్ టీలో అధిక మొత్తంలో చక్కెర ఉంటుంది. ఇది శరీరంలో కేలరీలను పెంచుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, స్వీట్ టీలో అధిక మొత్తంలో చక్కెర ఉంటుంది, ఇది జీర్ణవ్యవస్థకు హాని కలిగిస్తుంది. అటువంటి పరిస్థితిలో, 1 నెల పాటు తీపి టీ తాగకపోవడం మీ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. స్వీట్ టీలో కెఫిన్ ఉన్నందున ఒక నెల పాటు స్వీట్ టీ తాగకపోవడం మీ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది అని చాలా పరిశోధన పత్రాలలో వచ్చింది. చర్మం ఆరోగ్యంగా ఉండటానికి, స్వీట్ టీ తాగడం నిషేధించబడింది ఎందుకంటే ఈ టీ చర్మంపై మొటిమలు మరియు మచ్చలను కలిగిస్తుంది. ముఖ్యంగా ఒక నెలరోజుల పాటు టీకి దూరంగా ఉండటం వల్ల మన శరీరంలో కెఫిన్ తీసుకోవడం తగ్గుతుంది. దీని వల్ల మనకు గాఢమైన , మెరుగైన నిద్ర వస్తుంది. మనలో ఆందోళన తగ్గుతుంది. మూత్రవిసర్జన ప్రభావాల కారణంగా, ఎక్కువ మొత్తంలో టీ తాగడం వల్ల మన శరీరంలో నీటి పరిమాణాన్ని తగ్గిస్తుంది. ఒక నెల పాటు తీపి టీ తాగకపోవడం వల్ల, మీరు రోజంతా శక్తితో ఉండటమే కాదు. బదులుగా, ఇది మీ పని ఉత్పాదకతను కూడా పెంచుతుంది. టీ తాగటం మానేయడం వల్ల డీహైడ్రేషన్ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. అంతే కాకుండా, టీ తాగడం వల్ల మన కణాలకు హాని కలిగించే ఫ్రీ రాడికల్స్ తగ్గుతాయి. దీని వల్ల జీర్ణ సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లు రాకుండా ఉంటాయి. టీ అలవాటును మానేయటం వల్ల గుండెల్లో మంట, తలతిరగడం, గుండె వేగంలో హెచ్చుతగ్గులు వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. మీ చేతులు వణుకుతున్నట్లయితే, టీ తాగడం వల్ల ఈ సమస్య మరింత తీవ్రతరం అవుతాయి. ఒక వారం పాటు టీ తాగడం మానేస్తే, మీ అధిక రక్తపోటు సాధారణ స్థితికి వస్తుంది.

సన్నగా స్లిమ్ అవ్వాలంటే..

చియా సీడ్స్ డ్రింక్ ఇలా ట్రై చేయండి..

చియా విత్తనాలలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉన్నాయి. నారింజలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల నారింజ రసంలో నానబెట్టిన చియా గింజలను తాగడం వల్ల పోషకాల శోషణ పెరుగుతుంది. ఆరెంజ్ అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన సిట్రస్ పండు. ఇది విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌కు మంచి మూలం. రోగనిరోధక శక్తిని పెంచడం నుండి చర్మ సంరక్షణ వరకు, నారింజ సహాయపడుతుంది. చియా గింజలు ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ప్రోటీన్, యాంటీఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉన్నాయి. చియా విత్తనాలలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ఫైబర్, ప్రోటీన్, కాల్షియం, మెగ్నీషియం పుష్కలంగా ఉన్నాయి. నారింజలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల నారింజ రసంలో నానబెట్టిన చియా గింజలను తాగడం వల్ల పోషకాల శోషణ పెరుగుతుంది. చియా గింజలు, నారింజ రెండింటిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అందువల్ల నారింజ జ్యూస్ చియా గింజలతో కలిపి తాగడం వల్ల మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మంచి పేగు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఫైబర్ పుష్కలంగా ఉన్నందున నారింజ-చియా గింజలను డయాబెటిక్ రోగులు కూడా తమ ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల ఆరెంజ్-చియా గింజల జ్యూస్ తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే నారింజ-చియా గింజల జ్యూస్ తాగడం వల్ల చర్మ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

త్రిఫల నీటిని తాగడం

వల్ల కలిగే ప్రయోజనాలు

త్రిఫల.. ఆయుర్వేదంలో ఆరోగ్యానికి ఇది ప్రభావవంతమైన దివ్యౌషధం. దీంతో శరీరంలోని అనేక రకాల అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు. పూర్వకాలం నుంచి త్రిఫలను అనేక రోగాలకు ఔషధంగా వాడుతున్నారు. కానీ, త్రిఫల సహాయంతో ఆరోగ్య ప్రయోజనాలు మాత్రమే కాదు..మీ బరువును సహజంగా తగ్గించుకోవచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. మూడు రకాల ఔషధాలు ఇందులో ఉండటం వల్ల దీనికి త్రిఫల అనే పేరు వచ్చింది. ఉసిరి, కరక్కాయ, తానికాయ ఇందులో ఉంటాయి. ఈ మూడింటి మిశ్రమంతో త్రిఫల తయారుచేస్తారు. దీనిని తీసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా త్రిఫల ఫ్యాట్ బర్నర్ డ్రింక్ తాగడం వల్ల బరువు తగ్గుతారు. అలాగే జీర్ణవ్యవస్థ కూడా బలపడుతుంది. అటువంటి పరిస్థితిలో మలబద్ధకం వంటి సమస్యల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చు. అంతేకాదు.. త్రిఫలను ఆహారంలో భాగంగా తీసుకుంటే కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. కళ్ల మసక రాకుండా ఉంటుంది. త్రిఫలను తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ పేరుకుపోకుండా ఉంటుంది. బరువు తగ్గడానికి కూడా అవుతుంది. త్రిఫల నీటిని తయారు చేసుకుని తాగడం వల్ల శరీరంలోని విష పదార్థాలు తొలగిపోతాయి. దీంతో శరీరాన్ని అనేక సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. త్రిఫల నీటిని తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో అనేక సీజనల్ సమస్యల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవచ్చు. వేగవంతమైన జీవక్రియ కారణంగా, శరీరంలో కొవ్వు వేగంగా తగ్గుతుంది. బరువు నియంత్రణలో ఉంటుంది. త్రిఫల పానియాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా, జీర్ణవ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది, ఇది మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం పొందుతుంది. అలాగే శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్ ను బయటకు పంపి, తద్వారా పొట్టను శుభ్రంగా ఉంచి, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. త్రిఫలను తీసుకోవడం వల్ల ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. దంతాల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి. త్రిఫలను తీసుకుంటే పీరియడ్స్ సమస్యలు కూడా తగ్గుతాయి. త్రిఫలను తీసుకోవడం వల్ల చర్మంలో మెరుపు పెరుగుతుంది. యవ్వనంగా కనపడతారు. ముడతలు, మచ్చలు వంటి సమస్యలు కూడా ఉండవు. త్రిఫల మలబద్ధకం సమస్యను పోగొడుతుంది. అజీర్తి వంటి సమస్యల్ని దూరం చేస్తుంది. వాత, పిత్త, కఫ దోషాలని నయం చేయగలదు కూడా.

బ్రకోలీ తింటే ఈ సమస్యలన్నీ దూరం..

శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఇందుకోసం పోషక విలువలను ఆహారంలో చేర్చుకోవాలి. అలాంటి ఆహారాల్లో బ్రోకలీ కూడా ఒకటి. బ్రోకలీ ఆరోగ్యానికి దివ్యౌషధం. దీనిని తినడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయి. దీన్ని తినడం వల్ల శరీరంలో చాలా మార్పులు మొదలవుతాయి. బ్రకోలీ తీసుకోవడం వల్ల ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇక్కడ తెలుసుకుందాం. బ్రకోలీలో తగినంత మొత్తంలో ప్రోటీన్, జింక్, ఫైబర్, విటమిన్ ఎ, విటమిన్ సి లభిస్తాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అంతేకాదు, దీంతో అధిక రక్తపోటును నియంత్రిస్తుంది. పొటాషియం, కాల్షియం మరియు మెగ్నీషియం బ్రకోలీలో తగినంత పరిమాణంలో ఉంటాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. బ్రకోలీలో కొవ్వు, కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇందులో తగిన మోతాదులో ఫైబర్ ఉంటుంది. దీన్ని తినడం వల్ల కడుపు నిండుగా ఉంటుంది. దీనివల్ల బరువు తగ్గుతారు. పైగా, కళ్లను కూడా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. బ్రకోలీలో విటమిన్ ఎ ఉంటుంది. ఇది కళ్లను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. కంటి సంబంధిత సమస్యలను అధిగమించడానికి బ్రకోలీని తీసుకోవడం మంచిది. క్రియ, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అదనంగా, ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. బ్రోకలీలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఆర్థరైటిస్ ఉన్నవారిలో కీళ్ల నొప్పులకు కారణమయ్యే ఎంజైమ్‌లను అడ్డుకుంటుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. బ్రకోలీలో పొటాషియం, విటమిన్ సి, యాంటీ-ఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఇవి గుండె ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. దీన్ని తినడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు తగ్గుతాయి. ఇమ్యూనిటీని పెంచడంలో కూడా బ్రకోలీ చాలా మంచిది. రెగ్యులర్‌గా డైట్‌లో చేర్చుకుంటే చాలా మంచిది.

అయితే, థైరాయిడ్ ఉన్నవారు తినకపోవడమే మంచిది. బ్రకోలీని ఆహారంలో భాగంగా తీసుకోవటం వల్ల చర్మానికి చాలా మంచిది. చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచుతుంది. దీనికి కారణం బ్రకోలీ కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి వృద్ధాప్య ఛాయల్ని దూరం చేస్తుంది. బ్రకోలీలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల శరీరం హైడ్రేట్ అవుతుంది. వేడి వాతావరణంలో డీహైడ్రేషన్ నుంచి బయటపడేందుకు ఇది చాలా మంచిది.

ఇంగువ ప్రయోజనాలు..

చలికాలంలో ఇంగువ వినియోగం శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇందుకోసం చలికాలంలో రోజూ చిటికెడు ఇంగువను తీసుకోవాలి. ఇంగువ తీసుకోవడం వల్ల శరీరానికి అనేక ఇతర ప్రయోజనాలను కూడా ఉన్నాయి. మీరు బరువు తగ్గాలనుకుంటే ఇంగువ తీసుకోవడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఇంగువ ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. గ్యాస్ సమస్యను నివారిస్తుంది. ఇలా చేస్తే ఊబకాయం సమస్యను దూరం చేసుకోవచ్చు. ఫ్రీ రాడికల్స్ నుండి రక్షణ ఇంగువఇందులో యాంటీ ఆక్సిడెంట్లు మంచి మోతాదులో ఉంటాయి. వీటి ద్వారా ఫ్రీ రాడికల్స్ నివారించవచ్చు. ఇంగువ తీసుకోవడం ద్వారా వాపు, గుండె జబ్బులు, క్యాన్సర్ మరియు టైప్-2 మధుమేహం వంటి సమస్యలను నివారించవచ్చు. ఇంగువను రోజూ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. ఇంగువ తినడం వల్ల అజీర్ణం, కడుపు తిమ్మిర్లు, గ్యాస్ మొదలైన సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. దీని నుండిప్రకోప ప్రేగు సిండ్రోమ్ సమస్యను నివారించవచ్చు. రోజూ ఇంగువ తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్ అదుపులో ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, మీరు ప్రతిరోజూ ఉదయం ఇంగువ నీరు త్రాగవచ్చు. దీనివల్ల మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు.ఇంగువ తీసుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు చర్మానికి కూడా మేలు చేకూరుతుంది. ఇంగువ తీసుకోవడం వల్ల చర్మానికి సహజమైన మెరుపు వస్తుంది. దీంతో ముడతలు, మొటిమలు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. చలికాలంలో రోజూ చిటికెడు ఇంగువ తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు కలుగుతాయి. మీరు ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా అనేక సమస్యల నుండి శరీరాన్ని రక్షించుకోవడానికి ఇంగువ దివ్యౌషధంగా పనిచేస్తుంది.

మొక్కజొన్న పీచు ఆరోగ్య ప్రయోజనాలు..

చలికాలంలో కాల్చిన లేదంటే, వేయించిన మొక్కజొన్నలో నిమ్మరసం, మసాలాలు కలిపి తింటే ఆ ఆనందమే వేరు. మొక్కజొన్న పిండితో రొట్టెలు తయారు చేసుకుని కూడా తింటుంటారు. ఎలా తిన్నా కూడా మొక్కజొన్న ఆరోగ్యానికి అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది. అయితే, మొక్కజొన్నలాగే దీని మొదట్లో ఉండే జుట్టు మొక్కజొన్న పీచు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుందని మీకు తెలుసా..? మొక్కజొన్న అంటే దాదాపు అందరికీ ఇష్టం. వీటిని కాల్చుకుని, ఉడికించుకుని తింటుంటారు..మొక్కజొన్న గింజలతో పాప్‌కార్న్ తయారు చేస్తారు. ఇది కూడా చాలా మంది ఇష్టంగా తింటారు. చలికాలంలో కాల్చిన లేదంటే, వేయించిన మొక్కజొన్నలో నిమ్మరసం, మసాలాలు కలిపి తింటే ఆ ఆనందమే వేరు. మొక్కజొన్న పిండితో రొట్టెలు తయారు చేసుకుని కూడా తింటుంటారు. ఎలా తిన్నా కూడా మొక్కజొన్న ఆరోగ్యానికి అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది. అయితే, మొక్కజొన్నలాగే దీని మొదట్లో ఉండే జుట్టు మొక్కజొన్న పీచు కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుందని మీకు తెలుసా..? . ఇది చదవడానికి మీకు వింతగా అనిపించవచ్చు, కానీ మొక్కజొన్నలా, దాని జుట్టు కూడా తింటారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, మొక్కజొన్నలో మనకు అవసరమైన పొటాషియం, విటమిన్ బి2, విటమిన్ సి, విటమిన్ కె, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, అనేక ఖనిజాలు ఉన్నాయి. మొక్కజొన్న వెంట్రుకలను ఉడికించి దాని నీటిని తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది అనేక ఆరోగ్య సమస్యలను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. మొక్కజొన్న వెంట్రుకలు ఉడికించి తయారు చేసిన నీరు తాగడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల కిడ్నీలో ఉండే నైట్రేట్లు, టాక్సిన్స్ తొలగిపోతాయి. ఇది కిడ్నీలో రాళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎవరికైనా కిడ్నీలో రాళ్లు ఇబ్బందిపెడుతూ ఉంటే, మొక్కజొన్న పీచు మరిగించి ఆ నీటిని తీసుకోవడం ద్వారా రాళ్ల సమస్య కూడా తొలగిపోతుంది.మొక్కజొన్న పీచు నుండి తయారు చేసిన నీరు రక్తపోటును నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. దీని వినియోగం ద్వారా రక్తపోటు అదుపులో ఉంటుంది. ఇందులో ఉండే మినరల్స్ రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మొక్కజొన్న జుట్టు నుండి వచ్చే నీరు మధుమేహంలో కూడా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. దీని వినియోగం రక్తంలో చక్కెరను అదుపులో ఉంచుతుంది. ఇది ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరుస్తుంది. మధుమేహాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది.మొక్కజొన్న జుట్టులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. అందువల్ల దీని వినియోగం శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరంలో మంట కారణంగా, మీరు ఏకకాలంలో అనేక ఆరోగ్య సమస్యలను కలిగి ఉండవచ్చు. కానీ రోజూ మొక్కజొన్న పీచు నీటిని తాగితే శరీరంలో వాపు తగ్గుతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే మొక్కజొన్న జుట్టుతో తయారు చేసిన నీరు మీకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీని వినియోగం శరీరంలో ఇన్ఫ్లమేషన్, వాటర్ రిటెన్షన్ సమస్యను నయం చేస్తుంది. ఇది శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్, అదనపు కొవ్వును తగ్గిస్తుంది. ఇది కొవ్వు తగ్గడానికి సహాయపడుతుంది.

వంటింటి మసాలాలతో డయాబెటిస్‌కు బైబై

డయాబెటిస్ అనేది ఒక దీర్ఘకాలిక వ్యాధి. ఒకసారి వచ్చిన తర్వాత జీవితాంతం రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచేందుకు మన జీవన విధానంలో సరైన ఫుడ్ డైట్ పాటించడం చాలా ముఖ్యం. ప్రస్తుత కాలంలో డయాబెటిస్ చాలా వేగంగా పెరుగుతోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా చాలా మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. అయితే సరైన ఫుడ్ డైట్ తో డయాబెటిస్ ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. మధుమేహం వచ్చినవారు రెగ్యులర్‌గా కొన్ని వంటింటి మసాలాలను తీసుకుంటే రక్తంలో షుగర్ స్థాయిలు నియంత్రించవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ మెంతులలో ఉన్న ఫైబర్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని కూడా పెంచుతుంది. వీటిని ఎలా తీసుకోవాలంటే..? 1 టీ స్పూన్ మెంతులను నీటిలో మరిగించి ఉదయాన్నే గోరు వెచ్చగా తాగాలి. మెంతులను రాత్రంతా నీటిలో నానబెట్టి, ఆ నీటిని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయి. వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ రసాయనం రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో 1-2 వెల్లుల్లి రెబ్బలను తినాలి. లేదంటే వెల్లుల్లి టీ తయారు చేసుకుని తాగవచ్చు. అందుకోసం 2 వెల్లుల్లి రెబ్బల్ని నీటిలో వేసి బాగా మరిగించి వడకట్టి గోరువెచ్చగా తాగండి. దాల్చిన చెక్కను కూరల్లో, సూప్‌లలో, స్మూతీలలో ఉపయోగించవచ్చు. దీనిలో ఉన్న రసాయనాలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి. దాల్చిన చెక్క పొడిని టీగా తయారు చేసుకుని ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగండి. 1 గ్లాస్ నీటిని మరిగించి అందులో దాల్చిన చెక్క పొడిని వేసి వడకట్టుకొని తాగితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. డయాబెటిస్ నియంత్రణకు వంటింటి మసాలాలు చాలా సహాయపడతాయి. మెంతులు, వెల్లుల్లి, దాల్చిన చెక్క రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించి, ఇన్సులిన్ ఉత్పత్తిని మెరుగుపరుస్తాయి. ఈ సహజమైన మార్గాలు డయాబెటిస్ సమస్యను నియంత్రించడంలో ప్రభావవంతంగా ఉంటాయి.

వంద కోట్ల ఓటర్లకు చేరువలో భారత్

న్యూఢిల్లీ : దేశంలో ఓటర్ల సంఖ్య వంద కోట్లకు చేరువ కానుందని ఎన్నికల సంఘం (ఇసి) వెల్లడించింది. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల కంటే ప్రస్తుతం ఓటర్ల సంఖ్య పెరిగిందని ఇసి వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికల సమయంలో 96.88 కోట్ల ఓటర్లు వుండగా, ఆ సంఖ్య ఇప్పుడు 99.1 కోట్లకు పెరిగిందని ఇసి లెక్కలు వెల్లడిస్తున్నాయి. జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ మేరకు ఎన్నికల సంఘం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 18- 29 సంవత్సరాల మధ్య వయసు గల ఓటర్లు 21.7 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని ఇసి ఈ ప్రకటనలో తెలిపింది. ఇటీవలి కాలంలో ఎన్నికల లింగ నిష్పత్తి కూడా పెరిగిందని ఇసి పేర్కొంది. 2024లో 948 పాయింట్లుగా ఉన్న లింగ నిష్పత్తి 2025కల్లా 954కి చేరింది. ఆరుశాతం మేర లింగనిష్పత్తి పెరిగిందని ఇసి తెలిపింది.

కాగా, 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పాటైంది. ఇసి వ్యవస్థాయపక దినోత్సవం సందర్భంగా.. ప్రతి సంవత్సరం జనవరి 25న ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నాము. వచ్చే నెల ఫిబ్రవరి 5వ తేదీన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఎన్నికల షెడ్యూల్‌ని ప్రకటించే ఒకరోజు ముందు (జనవరి 6వ తేదీ) భారత్‌లో ఓటర్ల సంఖ్య 99 కోట్లు దాటిందని, త్వరలోనే వంద కోట్ల ఓటర్లు కలిగిన దేశంగా భారత్ రికార్డు సృష్టిస్తుందని చీఫ్ ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ అన్నారు.

నేతాజీ అస్థికలు తెప్పించండి

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్‌ఫౌజ్ స్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణంపై అనుమానాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన అస్థికలను భారత్‌కు తీసుకొచ్చి, వాటికి డీఎన్ఏ పరీక్ష నిర్వహించాలన్న డిమాండ్ పెరుగుతోంది. నేతాజీ కుటుంబ సభ్యులు కూడా పదేపదే ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేస్తున్నారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అస్థికలకు డీఎన్ఏ పరీక్ష నిర్వహిస్తే విమాన ప్రమాదంలో చనిపోయింది నేతాజీయా కాదా అనే విషయం తేలిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం నేతాజీ అస్థికలను జపాన్‌లోని రెంకోజీలో ఉన్న బౌద్ధ దేవాలయంలో ఓ కలశంలో భద్రపరిచారు. అనేక దశాబ్దాలుగా అవి అక్కడే ఉన్నాయి. అవి నేతాజీవేనని కొందరు భావిస్తుండగా మరి కొందరు కావని అంటున్నారు. ఇప్పుడు తైవాన్‌గా పిలుస్తున్న ప్రాంతంలో 1945 ఆగస్ట్ 18న జపాన్ సైనిక విమానం కూలిపోయింది. ఆ ప్రమాదంలో నేతాజీ మరణించారని కొందరు, కాదని కొందరు వాదిస్తున్నారు. ప్రమాదం జరిగిన రోజు నుండే నేతాజీ అదృశ్యమయ్యారు. దీనిపై పది జాతీయ, అంతర్జాతీయ దర్యాప్తులు జరిగాయి. ఇప్పుడు వాటి నివేదికలు న్యూఢిల్లీలోని నేషనల్ ఆర్కివ్స్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం తైవాన్‌లోని తైహెూకూలో ఉన్న జపాన్ సైనిక వైమానిక స్థావరంలోని ఆస్పత్రిలో బోస్ చనిపోయారని ఆ దర్యాప్తు నివేదికలు ధృవీకరించాయి.

అయితే సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి మనోజ్ కుమార్ ముఖర్జీ నేతృత్వంలోని కమిటీ మాత్రం ఇందుకు భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఇది నేతాజీ మరణంపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన చిట్టచివరి విచారణ కమిటీ. 2005 నవంబరులో కమిటీ తన నివేదికను సమర్పించింది. బోస్ చనిపోయిన మాట నిజమే కానీ అందరూ చెబుతున్నట్లు విమాన ప్రమాదంలో కాదని కమిటీ తెలిపింది. జపాన్ దేవాలయంలో ఉన్న అస్థికలు నేతాజీవి కావని స్పష్టం చేసింది. అయితే కమిటీ నివేదికను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. తమకు జపాన్ బౌద్ధ దేవాలయ మత గురువులు సహకరించలేదని, తక్కువగా కాలిపోయిన కొన్ని ఎముక ముక్కలను సేకరించి డీఎన్ఏ పరీక్ష నిర్వహించేందుకు అనుమతించలేదని కమిటీ తన నివేదికలో ప్రస్తావించింది.

ఐదేళ్లలో నిరుద్యోగాన్ని నిర్మూలిస్తాం

న్యూఢిల్లీ : వచ్చే ఐదేళ్లలో ఢిల్లీలో నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. 'యువతకు ఉపాధి కల్పించడమే మా ప్రాధాన్యత. నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు మా బృందం ఒక ప్రణాళికను రూపొందిస్తోంది. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం రెండేళ్లలో 48 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. అలాగే, మూడు లక్షలకు పైగా ప్రైవేటు రంగ ఉద్యోగాలను కల్పించాం. ఉపాధి ఎలా సృష్టించాలో మాకు బాగా తెలుసు. ప్రజల మద్దతుతో మళ్లీ అధికారంలోకి వస్తే ఐదేళ్లలో ఢిల్లీలో నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తాం' అని ఆయన పేర్కొన్నారు. ఆప్ పాలనలో ఢిల్లీని డంపింగ్ యార్డులా మార్చేశారని, 24 గంటల విద్యుత్ అందించడంలేదంటూ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇటీవల చేసిన ఆరోపణలను కేజ్రీవాల్ తిప్పికొట్టారు. గురువారం పశ్చిమ ఢిల్లీలోని హరినగర్‌లో ఆప్ అభ్యర్థి తరఫున నిర్వహించిన ప్రచార సభలో కేజ్రీవాల్ మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్‌లో కరెంటు కోతల మాటేమిటని? యోగిని ఆయన ప్రశ్నించారు. 'నేను చాలా మందిని అడిగా. ఢిల్లీలో 24 గంటలూ విద్యుత్ అందుబాటులో ఉందని చెబుతున్నారు. ఆప్ సర్కార్ ఢిల్లీలో పదేళ్లుగా ఉంది. ఐదేళ్లలోనే 24 గంటల నిరంతర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకురాగలిగాం. యుపిలో బిజెపి 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం రోజుకు ఎన్ని గంటలు విద్యుత్ అందిస్తోందో? యోగిజీ పరిశీలించుకోవాలి' అని కేజ్రీవాల్ అన్నారు.

ఇన్‌కాయిస్‌కు నేతాజీ 'ఆప్ప ప్రబంధన్' పురస్కారం

న్యూఢిల్లీ: విపత్తుల నివారణకు నిస్వార్థ సేవలందించే పౌరులకు, సంస్థలకు కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ అందజేసే ప్రతిష్టాత్మక నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'ఆప్ప ప్రబంధన్' పురస్కారం ఈ ఏ:డాదికి గాను హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓసియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఇన్‌కాయిస్)కు లభించింది. ఈ పురస్కారం కింద రూ.51 లక్షల నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు. నేతాజీ జయంతి సందర్భంగా గురువారం నాడు కేంద్ర హెూంమంత్రిత్వ శాఖ ఈ మేరకు ప్రకటించింది. ఈ పురస్కారానికి గతేడాది జులై నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా ..295 నామినేషన్లు వచ్చినట్లు హెూంశాఖ వెల్లడించింది. వీటిలో ఇన్‌కాయిస్‌ను పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపింది. హైదరాబాద్‌లో 1999లో స్థాపించిన ఇన్‌కాయిస్ సముద్ర సంబంధిత ప్రమాదాల గురించి ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో ప్రఖ్యాతిగాంచింది. ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సెంటర్ (ఐటిఇడబ్ల్యుసి) వ్యవస్థతో 10 నిమిషాల్లోనే ఈ సంస్థ సునామీ హెచ్చరికలను అందజేయగలదు. భారత్‌తో పాటు 28 దేశాలకు సేవలందిస్తోంది. సునామీ సర్వీస్ ప్రొవైడర్ గా యునెస్కో సైతం ఇన్‌కాయిస్‌ను గుర్తించింది. భూకంప కేంద్రాలు, అలల తీవ్రత, ఇతర సముద్ర సెన్సార్‌ల నెట్‌వర్క్‌కు ఈ సంస్థ సమాచార సేవలందిస్తోంది. 2013 ఫైలిన్, 2014 హుద్హుద్ తుఫాను సమయంలో అందించిన సలహాలు, సహాయంతో సకాలంలో ప్రజల తరలింపు, తీరప్రాంత ప్రమాదాలను తగ్గించడంలో కీలక పాత్రం పోశించింది. సముద్రంలో గల్లంతైన వ్యక్తులు, వస్తువులను గుర్తించడంలో ఇండియన్ కోస్ట్ గార్డ్, నేవీ, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులకు సహకారం అందించేందుకు ప్రత్యేకంగా సెర్చ్ అండ్ రెస్క్యూ ఎయిడెడ్ టూల్ (సరత్)ని అభివృద్ధి చేసి ఇన్‌కాయిస్ సేవలందిస్తోంది.

మీ వాదనలకు ముగింపు ఉండదా ?

న్యూఢిల్లీ: 2020 అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్, మరో ఆరుగురు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను వ్యతిరేకిస్తూ ప్రాసిక్యూషన్ అదే పనిగా సుదీర్ఘ వాదనలు విన్పించడాన్ని ఢిల్లీ హైకోర్టు తప్పు పట్టింది. ముగింపు లేని వాదనలను తాను వినబోనని తేల్చి చెప్పింది. ఇమామ్ చేసినట్లుగా చెబుతున్న ప్రసంగాలను ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమిత్ ప్రసాద్ చదవడం ప్రారంభించగానే జస్టిస్ నవీన్ చావ్లా, జస్టిస్ షలీందర్ కౌర్‌తో కూడిన బెంచ్ అడ్డు తగిలింది. 'మీ సుదీర్ఘ వాదనలు ఇంకా ఎంత కాలం కొనసాగుతాయి?' అని ప్రశ్నించింది. 'మీ వాదనలను ఆపేయండి. అవి ఇప్పుడే ఆగిపోవాల్సిన అవసరం ఉంది. ముగింపు అనేది లేకుండా అవి కొనసాగకూడదు. మేము మీకు ఎక్కువ సమయం ఇవ్వలేము' అని హైకోర్ట్ బెంచ్ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఢిల్లీ పోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కూడా ఈ కేసులో తన వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. 'మీరు ఇప్పుడే వాదనలు ముగించాలి. అవి ముగింపు లేకుండా కొనసాగకూడదు' అని జస్టిస్ చావ్లా సూచించారు. అనంతరం తదుపరి విచారణను ఫిబ్రవరి 12వ తేదీకి వాయిదా వేశారు. నాలుగు సంవత్సరాలకు పైగా జైలు జీవితం గడుపుతున్న ఖలీద్, ఇమామ్, మహమ్మద్ సలీం ఖాన్, షిఫా ఉర్ రెహమాన్, షాదాబ్ అహ్మద్, అథర్ ఖాన్, ఖలీద్ సైఫీ, గుల్ఫిషా ఫాతిమా దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు విచారణ జరుపుతోంది. వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని సమర్థించే వారికి, వ్యతిరేకించే వారికి మధ్య 2020 ఫిబ్రవరిలో ఈశాన్య ఢిల్లీలో ఘర్షణలు చెలరేగాయి. దీనికి సంబంధించి నిందితులపై పలు చట్టాల కింద కేసులు నమోదు చేశారు. ఢిల్లీ అల్లర్లలో 53 మంది చనిపోగా వందలాది మంది గాయపడ్డారు.

ప్రతీకార చర్యలకు దిగితే తీవ్ర పర్యవసానాలే

దావోస్ : వాణిజ్య యుద్ధాల వల్ల అంతర్జాతీయ అభివృద్ధికి తీవ్రమైన పర్యవసానాలు కలుగుతాయని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) డైరెక్టర్ జనరల్ నాగొజి ఒకొంజొ హెచ్చరించారు. గురువారం ఇక్కడ జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యుఇఎఫ్) సమావేశాల్లో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులపై చర్చించేందుకు ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 25 శాతం లేదా 60 శాతం టారిఫ్‌లు విధిస్తూ మనం ప్రతీకార చర్యలకు పాల్పడినట్లైతే, మళ్లీ 1930ల కాలానికి వెళ్లిపోతామని, రెండంకెల్లో జిడిపి నష్టాలను చవి చూస్తామని ఆయన వ్యాఖ్యానించారు. అటువంటి పరిస్థితులు అందరికీ తీవ్ర వినాశనాన్ని కలిగిస్తాయన్నారు. అందుకు మూల్యం చెల్లించక తప్పదన్నారు. కృత్రిమ మేధస్సు, సంస్కరణలపై తక్షణమే కార్యాచరణ చేపట్టాలని పలు దేశాలకు చెందిన నేతలు పిలుపునిచ్చారు. తప్పుడు సమాచార వ్యాప్తిని, సైబర్ వేధింపులను అణచివేసేందుకు యురోపియన్ యూనియన్ వ్యాప్తంగా సోషల్ మీడియా పాలనలో సంస్కరణలు రావాలని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ కోరారు. రాబోయే కాలంలో ద్రవ్యోల్బణాన్ని అదుపులో వుంచుతూ 6 నుండి 8 శాతం ఆర్థికాభివృద్ధి రేటును భారత్ కొనసాగిస్తుందని కేంద్ర రైల్వే, సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం చెప్పారు. గురువారం ఇక్కడ జరుగుతున్న డబ్ల్యుఇఎఫ్ సమావేశాల్లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థిక ప్రణాళికకు సర్వతోముఖాభివృద్ధి అనేది మూల స్తంభంగా వుంటుందని అన్నారు. దీనికి తోడు తయారీ, సేవలు, చట్టాల సరళీకరణ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి కొనసాగిస్తూనే వుండాల్సి వుంటుందన్నారు.

అమెరికాలో 600 బిలియన్ల డాలర్ల పెట్టుబడులు

రాబోయే నాలుగేళ్ళ కాలంలో అమెరికాలో 600 బిలియన్ల డాలర్ల (దాదాపు 51.87 లక్షల కోట్ల రూపాయలు) పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్లు సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ గురువారం తెలిపారు. అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్‌తో ఆయన ఫోన్లో మాట్లాడిన అనంతరం ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, తన మొదటి విదేశీ పర్యటనగా బ్రిటన్‌లో పర్యటించడానికి ట్రంప్ యోచిస్తున్నారు. 2017లో ట్రంప్ ఇలాగే పర్యటించారు. చమురు సంపన్న గల్ఫ్ దేశాల పాలకులతో అమెరికా సంబంధాలు మెరుగైన రీతిలో వుండేందుకు తాము ప్రాధాన్యత ఇస్తామని ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం చెప్పింది. అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను మెరుగుపరుచుకోవాలని తాము కూడా భావిస్తున్నట్లు సౌదీ యువరాజు తెలిపారు. అయితే ఈ పెట్టుబడులు ఏ ఏ రంగాల్లో ఎక్కడెక్కడ పెడతారు, వాణిజ్య వివరాలు వంటివి ఆయననే జారీ చేసిన ప్రకటనలో వెల్లడించలేదు. ఇటీవల కాలంలో సౌదీ చమురు ఎగుమతులపై అమెరికా ఎక్కువగా ఆధారపడుతూ వస్తోంది. అలాగే అమెరికా తయారీ ఆయుధాలు, రక్షణ వ్యవస్థలపై సౌదీ అరేబియా ప్రధానంగా ఆధారపడుతోంది. బహుశా రక్షణ రంగంలోకూడా పెట్టుబడులు పెట్టే అవకాశాలు వుండొచ్చునని భావిస్తున్నారు. కాగా ఈ ఫోన్‌కాల్‌పై వైట్‌హౌస్ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

క్యూబాపై మళ్లీ తీవ్రవాద ముద్ర

వాషింగ్టన్ : క్యూబాను తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశాల జాబితాలోకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ చేర్చారు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే పరిస్థితి తారుమారైంది. ఒక వారం క్రితం క్యూబాను ఈ జాబితా నుండి తొలగిస్తూ ఎన్నాళ్ళగానో అందరూ ఎదురుచూస్తున్న నిర్ణయాన్ని మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్నారు. కానీ ట్రంప్ పగ్గాలు చేపట్టగానే మళ్లీ ఆ నిర్ణయాన్ని రద్దు చేశారు. క్యూబాపై పలు రకాలుగా ఏకపక్ష ఆంక్షలు విధించడంతో ఒక రకంగా అంతర్జాతీయ వాణిజ్య పరిధి నుండి ఆ దేశం బయటకు వచ్చేసింది. ఈ కారణంగా ఇంధనం వంటి కీలక ఉత్పత్తుల కొరత చాలా తీవ్రంగా వుంటోంది. ఆంక్షలు సహా ఇటువంటి చర్యలతో క్యూబా అనేక మానవతా సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ట్రంప్ తీసుకున్న చర్యను క్యూబా అధ్యక్షుడ డియాజ్ కానెల్ తీవ్రంగా విమర్శించారు. అహంకారపూరితమైన చర్యగా అభివర్ణించారు. వాస్తవంతో ఏ మాత్రం సంబంధం లేకుండా తీసుకున్న చర్యని వ్యాఖ్యానించారు. తన ఆధిపత్యం కోసం క్యూబాపై చాలా క్రూరమైన రీతిలో ఆర్థిక యుద్ధం జరపాలని, దాన్ని ఇంకా బలోపేతం చేయాలన్నది ట్రంప్ లక్ష్యమని క్యూబా అధ్యక్షుడు పేర్కొన్నారు. నిండా అహంకారంలో మునిగిపోయారని ట్రంప్‌పై క్యూబా విదేశాంగ మంత్రి బ్రూనో రొడ్రిగజ్ తీవ్రంగా విమర్శించారు. క్యూబన్ల కుటుంబాలను శిక్షించాలన్నది ఆయన అభిమతంగా వుందన్నారు. అయితే ఇలాంటి చర్యల వల్ల క్యూబన్ల కృత నిశ్చయాలను నీరు గార్చలేరని, అంతిమంగా విజయం తమదేనని రొడ్రిగజ్ స్పష్టం చేశారు. లాటిన్ అమెరికా, కరేబియా వ్యాప్తంగా సామాజిక, రాజకీయ సంఘాల వేదిక అల్బా మూవ్‌మెంట్స్ కూడా ఈ చర్యలను తీవ్రంగా ఖండించింది. సాంప్రదాయేతర యుద్ధ విధానాలకు పాల్పడుతూ ఊచకోత విధానంలో భాగంగా ఇటువంటి చర్యలు తీసుకుంటున్నారని ఆ వేదిక విమర్శించింది. అల్బా-టిసిపి కూడా ట్రంప్ చర్యను తీవ్రంగా వ్యతిరేకించింది.

మాజీ సిఎం హరీశ్ రావత్ ఓటు గల్లంతు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ మాజీ సిఎం హరీశ్ రావత్ పేరు ఓటరు జాబితాలో గల్లంతయింది. ఈ విషయాన్ని అధికారులే స్వయంగా వెల్లడించారు. నేడు ఆ రాష్ట్రంలో 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 43 మున్సిపాల్టీలు, 46 నగర పంచాయితీలకు పోలింగ్ జరుగుతోంది. ఈ ఎన్నికల్లో ఓటేసేందుకు ఆ రాష్ట్ర మాజీ సీఎం హరీశ్ రావత్ డెహ్రాడూన్‌లో ఓటు వేయడానికి పోలింగ్ బూత్‌కి వెళ్లారు. అయితే అక్కడ ఓటరు లిస్టులో ఆయన పేరు గల్లంతయింది. దీంతో ఆయన ఓటు వేయలేకపోయారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో డెహ్రాడూన్‌లోని నిరంజన్‌పుర్ ఏరియా నుంచి ఆయన ఓటు వేశారు. కానీ ఈసారి మాత్రం ఆ ప్రదేశం నుంచి ఆయన ఓటు వేయలేకపోయారు. కాగా, ఓటర్ల జాబితా నుంచి పేరు గల్లంతు అయిన అంశంపై హరీశ్ రావత్ స్పందించారు. ఈరోజు ఉదయం నుంచి ఓటు వేసేందుకు తాను నిరీక్షిస్తున్నానని, కానీ పోలింగ్ స్టేషన్‌లో తన పేరు లేకపోవడంతో ఓటు వేయలేకపోయానని అన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తాను ఇక్కడి నుంచే ఓటేశానని.. ఈకొద్ది కాలంలోనే ఓటరు లిస్టులో తన పేరును బిజెపి మాయం చేసిందని ఆరోపించారు.

ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే, కంప్యూటర్ సర్వర్లు మొరాయిస్తున్నట్లు ఈసీ చెప్పిందని హరీశ్ రావత్ చెప్పారు.

క్యూబాపై మళ్లీ తీవ్రవాద ముద్రగ

కాలిఫోర్నియా : అమెరికాలోని సంపన్నుల ప్రాంతమైన లాస్‌ఏంజెల్స్‌లో మూడు వారాల క్రితం చెలరేగిన దావానలం ఇంకా పూర్తిగా శాంతించక మునుపే మరో ప్రాంతంలో తాజాగా కార్చిచ్చు మొదలైంది. గాలులు కూడా ఉధృతంగా వీస్తుండడంతో మంటలు చాలా వేగంగా వ్యాపిస్తున్నాయని అధికారులు తెలిపారు. విమానాల ద్వారా వాటర్ బాంబులను జార విడుస్తూ మంటల ఉధృతి తగ్గించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా, ఈ మంటల ముప్పుతో దాదాపు 50వేల మందిని ఇళ్ళను ఖాళీ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. లాస్‌ఏంజెల్స్‌కు ఉత్తరంగా పర్వత ప్రాంతాల్లో కాస్టాటిక్ సరస్సుకు సమీపంలో మంటలు చెలరేగుతున్నాయి. బుధవారం ఉదయం ప్రాంభమైన ఈ మంటలు ఒక రోజులోనే దాదాపు 9వేల ఎకరాలను దగ్ధం చేశాయి.

ప్రముఖ రిక్రియేషన్ ఏరియా అయిన కాస్టాటిక్ సరస్సుకు సమీపంలో దాదాపు 41 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చెట్లు, పొదలు పూర్తిగా మాడి మసైపోయాయి. గత మూడు వారాలుగా కార్చిచ్చు చెలరేగుతున్న ఈటన్, పాలిసాడ్స్ ఏరియాలకు ఈ ప్రాంతం 64కిలోమీటర్ల దూరంలో వుంది. మరోవైపు పెద్ద ఎత్తున దాదాపు 4వేల మంది అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు హెూరాహెూరీ శ్రమిస్తున్నారు. ఇంత చేస్తే 14శాతం మేరా మంటలను అదుపు చేయగలిగారు. ఈ పరిస్థితుల్లో లాస్‌ఏంజెల్స్, వెంటురా కౌంటీల్లో శుక్రవారం ఉదయం 10గంటల వరకు రెడ్ ఫ్లాగ్ హెచ్చరికలు జారీ చేశారు. 5వ నెంబరు అంతర్రాష్ట్ర రహదారిలో కొన్ని భాగాలను మూసివేశారు. పరిస్థితులు సద్దుమణిగిన తర్వాత తెరుస్తామని లాస్‌ఏంజెల్స్ కౌంటీ షరీఫ్ రాబర్ట్ లూనా చెప్పారు.

నూతనోత్తేజంతో, అద్భుత ప్రగతిలో అటవీ శాఖ పచ్చగా కళకళలాడాలి

-మొదటిపేజీ తరువాయి

అవసరం ఉందని స్పష్టం చేశారు. శాఖలో పూర్తిస్థాయి మార్పుచేర్పులతో మళ్లీ అటవీశాఖను రాష్ట్ర అవసరాల్లో, అభివృద్ధిలో ప్రాధాన్య స్థానంలో నిలిపేందుకు ప్రయత్నం మొదలుపెట్టారు. నూతనోత్తేజంతో, అద్భుత ప్రగతిలో అటవీ శాఖ పచ్చగా కళకళలాడాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. ఈ క్రమంలో భూముల పరిరక్షణను తొలి ప్రాధాన్యంగా తీసుకున్నారు. ముఖ్యంగా కడప అటవీ డివిజన్ పరిధిలో అటవీ భూముల ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆ డివిజన్ పరిధిలో విలువైన భూములు, భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే భూములను రక్షించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు.

శేషాచలంలో లభ్యమయ్యే ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయడంపై పకడ్బందీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రం నుంచి వేర్వేరు మార్గాల్లో ఇతర రాష్ట్రాల సరిహద్దుల ద్వారా అక్రమ రవాణా అవుతున్న ఎర్రచందనాన్ని అరికట్టాలని భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లోని పోలీసులకు దొరుకుతున్న ఎర్రచందనాన్ని వారు అక్కడే వేలం వేస్తుండటంతో రాష్ట్ర ఆదాయం తగ్గుతోందని గుర్తించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ .. రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ఠమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అడవుల్లో దొరుకుతున్న నాణ్యమైన, మేలైన, అరుదుగా దొరికే అటవీ ఉత్పత్తుల నుంచి ఆదాయం పెంపుదలకు సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని భావిస్తున్నారు. గిరిజనులను దీనిలో భాగం చేసి మార్కెటింగ్ చేయడం మీద తగిన మార్గం చూపాలని భావిస్తున్నారు. దానికి కార్పొరేట్ మార్కెట్ రంగంలో ఉన్నవారి సహకారం తీసుకోనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించిన విధంగా రాష్ట్రం 50 శాతం పచ్చదనం అభివృద్ధిని సాధించే దిశగా ముందుకు వెళ్లవచ్చని అధికారులకు పవన్ సూచించారు.

అంతే కాకుండా వన్య ప్రాణుల సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అడవుల్లో వేటను నిషేధించి, నిఘాను పెంపొందించడంతో పాటు గిరిజనులు సైతం అటవీ ప్రాణుల రక్షణ పట్ల చైతన్యం తీసుకురావడం ప్రధానమైన అంశంగా తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సరిహద్దు ప్రాంతాల్లో మదపుటేనుగుల గుంపు సమస్యపై సమీక్షించారు. కర్ణాటక ప్రభుత్వంతో మరోసారి మాట్లాడి కుంకీ ఏనుగులను త్వరితగతిన తీసుకురావాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. దేశం ఏటా రూ.22 వేల కోట్ల విలువైన కలప ఆధారిత దిగుమతులను చేసుకుంటున్న నేపథ్యంలో దాన్ని నివారించేందుకు అటవీ శాఖ ద్వారా దేశ అవసరాలకు తగిన కలప ఉత్పత్తులను తయారు చేసే దిశగా ఓ సమగ్రమైన ప్రణాళికను సిద్ధం చేయాలని పవన్ భావిస్తున్నారు. రాష్ట్రం నుంచి అధికంగా కలప ఉత్పత్తులు తయారు అయితే, దేశం దిగుమతి చేసుకునే ఉత్పత్తులను తయారు చేయగలిగితే అద్భుతాలు సాధించవచ్చని, 2047 నాటికి భారతదేశం కలప ఉత్పత్తులను ఎగుమతి చేసే దిశకు చేరుకోవాలని కార్యాచరణ నివేదికను రూపొందించాలని అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు.

స్టీల్ ప్లాంట్ లో ఏం జరుగుతోంది

విశాఖపట్టణం : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం నేపథ్యంలో.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.11,444 కోట్ల పునరుద్ధరణ ప్యాకేజీ ప్రకటించింది. దీనిపై రాజకీయ నాయకులు, కార్మిక సంఘాల నేతలు, మేథావులు స్టీల్‌ప్లాంట్ గురించి చర్చిస్తున్నారు.ప్రభుత్వంలో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు.. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని అంటున్నారు. మరోవైపు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. భద్రతా సిబ్బందిని తొలగిస్తున్నారు. ఇది ప్రైవేటీకరణలో భాగమేనని కార్మిక సంఘాల నేతలు చెబుతోన్నారు. ఏళ్ల తరబడి స్టీల్‌ప్లాంట్ ఆధ్వర్యంలో నడిచే ఫైర్ స్టేషన్‌ను ప్రైవేట్‌కు వ్యక్తులకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచారు. ఇప్పుడు భద్రతా సిబ్బందిని కుదిస్తోన్నారు.దీనిని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఒకపక్క ప్యాకేజీతో హడావుడి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. మరోవైపు ప్రైవేటీకరణ చర్యలు ఆపటం లేదని కార్మిక సంఘం నేత సీహెచ్ నర్సింగ్‌రావు విమర్శించారు. ఇప్పటికే కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో దాదాపు 800 మందిని రెన్యువల్ చేయలేదు. ఉద్యోగులు, అధికారులను వీఆర్ఎస్ పేరుతో పంపించే ప్రక్రియ సాగుతోంది. ఇంకోవైపు ఉద్యోగులకు ఇవ్వాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, ఎల్‌టీసీ, ఎల్ఎల్‌టీసీ, ఎల్‌టీఏ, హెఆర్ఏలు నిలిపివేశారు. దసరా, దీపావళి బోనస్ పూర్తిగా ఆపేశారుప్రధాన గేటు వద్ద ఉండే సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందిని తగ్గిస్తున్నట్లు.. సీజీఎం (వర్క్స్)కు సీనియర్ కమాండెంట్ లేఖ రాశారు. సాధారణ షిఫ్టుల్లో లోపలికి, బయటకు వచ్చే సమయంలో వాహనాల తనిఖీలు చేసే సిబ్బందిని కుదించారు. జనవరి 22నుంచే తగ్గింపు వర్తించేలా లేఖలో పేర్కొన్నారు. దీంతో 10 నుంచి 12 మంది ఉండే సీఐఎస్ఎఫ్ సిబ్బంది స్థానంలో.. కేవలం నలుగురిని మాత్రమే ఉంచేందుకు నిర్ణయం తీసుకున్నారు.ఇప్పుడు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు ఇచ్చే మెడికల్ స్కీంలో.. భారీ కోతలకు యాజమాన్యం ప్రతిపాదన చేసింది. ఆమోదం తరువాత త్వరలోనే ఇది అమలులోకి రానుంది. రిటైర్డ్ ఉద్యోగులకు గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీం (జీఎంఎస్) అందిస్తున్నారు. ఈ పథకంలో దంపతులకు రూ.6 లక్షల వరకూ మెడికల్ ఇన్సురెన్స్ వర్తిస్తుంది. దంపతులిద్దరూ ఇన్సురెన్సు వాటా కింద రూ.2,600 ఏటా చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన నగదును స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం భరిస్తోంది.ఓపీడీ ఇద్దరికి రూ.16 వేలు ఇస్తారు. స్టీల్‌ప్లాంట్ ఆసుపత్రిలో వైద్యం చేసుకుంటే ఉచితం. బయట ఎక్కడ పరీక్షలు చేయించుకున్నా, మందులు కొనుగోలు చేసిన ఓపీడీ నగదు రీయింబర్స్‌మెంట్ చేస్తారు. ఇప్పుడు ఆ విధానాన్ని మార్చారు. ఉద్యోగులు 30 శాతం కట్టాల్సి ఉంటుంది. దీనివల్ల రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలన్నింటిపై రూ.9 కోట్ల భారం పడుతోంది. ఓపీడీలో రూ.16 వేలులో సగానికి కోత విధించారు. దీనిపై కార్మిక, ఉద్యోగ సంఘాలు మండిపడుతోన్నాయి. మరోవైపు గొప్పగా చెప్పుకున్న పునరుద్ధరణ ప్యాకేజీకి సంబంధించిన విధివిధానాలు ఇప్పటికీ విడుదల కాలేదు. మొత్తం ప్యాకేజీ రూ.11,444 కోట్లు కాగా, మొదటి విడుతగా విడుదల చేసే రూ.10,300 కోట్ల విలువైన బాండ్లను ఏయే ఖర్చులకు ఉపయోగించాలో ఇంకా మార్గదర్శకాలు విడుదల కాలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీపై అయోమయం నెలకొంది. ప్యాకేజీ పట్ల అనుమానులు వ్యక్తం అవుతోన్నాయి. ప్యాకేజీ కేవలం ప్రకటన మాత్రమేనా లేక కార్యరూపం దాల్చుతుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఇప్పటి వరకు 700 మంది ఉద్యోగులు, అధికారులు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా ఈనెల 31 వరకు వరకు వీఆర్ఎస్‌కు దాఖలు చేసుకునేందుకు అవకాశం ఉంది. వీఆర్ఎస్ తీసుకునే వారి సంఖ్య పెరగనుంది. ప్రస్తుతం ఉన్న 12,300 మంది శాశ్వత ఉద్యోగులు ఉండగా.. వారిలో ఈ ఏడాది ఆగస్టులో 800 మంది రిటైర్డ్ కాబోతున్నారు. ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గనుంది.

రిపబ్లిక్ పరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మలు

విశాఖపట్టణం : గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ ఏటికొప్పాక బొమ్మల శకటం (ఏటికొప్పాక బొమ్మలు– ఎకో ఫ్రెండ్లీ చెక్క బొమ్మలు థీమ్) ఎంపికైంది. తెలుగువారి సంప్రదాయాలను ప్రతిబింబించేలా అధికారులు ఈ శకటానికి రూపకల్పన చేశారు. ఇందులో ఏర్పాటుచేసిన శ్రీవేంకటేశ్వరస్వామి రూపం అందర్నీ ఆకట్టుకొనేలా ఉంది. ఇందులోనే వినాయకుడి ప్రతిమ, హరిదాసు, బొమ్మలకొలువు, చిన్నారుల ఆటపాటలకు సంబంధించిన చిత్రాలకు స్థానం కల్పించారు.అనకాపల్లి దగ్గరలోని వరాహనది ఒడ్డున ఉన్న ఏటికొప్పాక గ్రామం పేరుతో ఈ బొమ్మలు ప్రసిద్ధిగాంచాయి. 2020 ఆగస్టు 30న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశీయంగా తయారయ్యే బొమ్మలను ప్రోత్సహించాలని ప్రజలకు పిలుపునిస్తూ ఈ ఏటికొప్పాక బొమ్మల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "చెక్కతో తయారుచేసే ఈ బొమ్మల్లో ఎక్కడా వంపు కోణం కనపడకపోవడం విశేషం. ఏటికొప్పాకలాంటి పర్యావరణ అనుకూల బొమ్మలను ప్రోత్సహిద్దాం" అని ప్రధాని అందులో పిలుపునిచ్చారు.కర్ణాటక (లక్కుండి: రాతి చేతిపనుల ఊయల), గోవా (గోవా సాంస్కృతిక వారసత్వం), ఉత్తరాఖండ్ (ఉత్తరాఖండ్: సాంస్కృతిక వారసత్వం, సాహస క్రీడలు), హర్యానా (భగవద్గీతను ప్రదర్శిస్తోంది), జార్ఖండ్ (స్వర్ణిమ్ జార్ఖండ్: ఎ లెగసీ ఆఫ్ హెరిటేజ్ అండ్ ప్రోగ్రెస్), గుజరాత్ (స్వర్ణిమ్ భారత్: విరాసత్ ఔర్ వికాస్), పంజాబ్ (పంజాబ్ జ్ఞాన భూమి), ఉత్తరప్రదేశ్ (మహాకుంభ్ 2025 – స్వర్ణిమ్ భారత్ విరాసత్ ఔర్ వికాస్), బీహార్ (స్వర్ణిం భారత్: విరాసత్ ఔర్ వికాస్ –నలంద విశ్వవిద్యాలయం), మధ్యప్రదేశ్ (మధ్యప్రదేశ్ కీర్తి: కునో నేషనల్ పార్క్– ది ల్యాండ్ చీతలు), త్రిపుర (శాశ్వత భక్తి: త్రిపురలో 14 దేవతల ఆరాధన – ఖర్చీ పూజ), పశ్చిమ బెంగాల్ ('లక్ష్మీ భండార్' ద 'లోక్ ప్రసార్ ప్రకల్ప' – బెంగాల్‌లో జీవితాలను శక్తివంతం చేయడం, స్వావలంబనను పెంపొందించడం), చండీగఢ్ (చండీగఢ్: వారసత్వం, ఆవిష్కరణ, స్థిరత్వం, సామరస్య సమ్మేళనం), ఢిల్లీ (నాణ్యమైన విద్య), దాద్రా నగర్ హవేలీ, డామన్ మరియు దయ్యూ (కుక్రి స్మారక చిహ్నంతో పాటు డామన్ ఏవియరీ బర్డ్ పార్క్ – భారత నావికాదళంలోని పరాక్రమ నావికులకు నివాళి) శకటాలు ప్రదర్శిస్తారు.సామాజిక న్యాయం, సాధికారత శాఖ (భారత రాజ్యాంగం, మన విరాసత్ (వారసత్వం), వికాస్, పథ్–ప్రదర్శక్ మూలస్తంభం), గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ (జంజాతీయ గౌరవ్ వర్ష్), మహిళ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ (మంత్రిత్వ శాఖ సమగ్ర పథకాల కింద పోషించబడిన మహిళలు, పిల్లల బహుముఖ ప్రయాణం), నూతన ద పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (స్వర్ణిమ్ భారత్: వారసత్వం, అభివృద్ధి), గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ (లఖ్‌పతి దీదీ), ఆర్థిక సేవల విభాగం (దేశం ఆర్థిక పరిణామంలో అద్భుతమైన ప్రయాణం), భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ (ఐఎండి) (తీవ్ర వాతావరణ పరిస్థితులను అంచనా వేయడం – ప్రాణాలను, జీవనోపాధిని కాపాడటం), పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ (స్వర్ణ భారత వారసత్వం, అభివృద్ధి దేశ స్వదేశీ పశువుల జాతులను స్థిరమైన గ్రామీణ వృద్ధికి చిహ్నాలుగా గౌరవించడం), మంత్రిత్వ శాఖ సంస్కృతి (స్వర్ణిమ్ భారత్: వారసత్వం, అభివృద్ధి), సిపిడబ్ల్యుడి (పుష్ప శకటంతో 75 సంవత్సరాల భారత రాజ్యాంగం) శకటాలను ప్రదర్శించనున్నాయి.రిపబ్లిక్ డే పరేడ్‌లో తొలిసారిగా 'శశక్త్ ఔర్ సురక్షిత్ భారత్' అనే థీమ్‌తో త్రి–దళాల శకటం పాల్గొననుంది. ఈ మేరకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. జనవరి 26న 76వ రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా ఉమ్మడిత్వం, సమైక్యత స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, త్రి–దళాల శకటం కర్తవ్య పథంలో తొలిసారిగా ప్రదర్శించనున్నట్లు తెలిపింది.

రాజకీయాలకు గుడ్ బై

-మొదటిపేజీ తరువాయి

లేకుండా కృషి చేశా. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశా. దాదాపు తొమ్మిదేళ్ల పాటు ప్రోత్సహించి కొండంత బలాన్ని, మనోధైర్యాన్నిచ్చి తెలుగు రాష్ట్రాల్లో నాకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ప్రత్యేక ధన్యవాదాలు. తెదేపాతో రాజకీయంగా విభేదించా. చంద్రబాబు కుటుంబంతో వ్యక్తిగతంగా విభేదాలు లేవు. పవన్ కల్యాణ్‌తో చిరకాల స్నేహం ఉంది. నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన రాష్ట్ర ప్రజలు, మిత్రులు, సహచరులు, పార్టీ కార్యకర్తలకు.. ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు. విజయసాయిరెడ్డి రాజ్యసభ పదవీకాలం 2028 జూన్ వరకు ఉంది.

ఇక నా భవిష్యత్తు వ్యవసాయం: విజయసాయిరెడ్డి

వైసీపీ సీనియర్ నేత, జగన్ కు అత్యంత సన్నిహితుడిగా పేరుపొందిన విజయసాయిరెడ్డి తన ట్వీట్ తో హాట్ టాపిక్ గా మారారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని ఆయన చేసిన ప్రకటన ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక... విజయసాయిరెడ్డి పార్టీ కోసం గళం విప్పిన సందర్భాలు అతి తక్కువ అని చెప్పాలి. విజయసాయి జగన్ కు దూరం జరుగుతున్నారని కొన్ని నెలలుగా ప్రచారం జరుగుతోంది. అది ఇవాళ నిజం అయింది. కాగా, రాజకీయాల నుంచి తప్పుకుంటున్న ప్రకటించిన విజయసాయి... తాను ఏ పార్టీలో చేరడం లేదని స్పష్టం చేశారు. ఇక తాను వ్యవసాయం చేసుకుంటూ బతుకుతానని వెల్లడించారు. "ఇక నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన నా రాష్ట్ర ప్రజలకు, మిత్రులకు, సహచరులకు, పార్టీ కార్యకర్తలకు, ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను" అని విజయసాయిరెడ్డి తన ప్రకటనలో పేర్కొన్నారు.

చంద్రబాబు కుటుంబంతో నాకెలాంటి విభేదాలు లేవు...

టీడీపీతో రాజకీయంగా విభేదించానే తప్ప... చంద్రబాబు గారి కుటుంబంతో వ్యక్తిగతంగా ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ గారితో చిరకాల స్నేహం ఉంది అని వెల్లడించారు. ఇక, నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా నన్ను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉన్నానని విజయసాయి తన వీడ్కోలు ప్రకటనలో పేర్కొన్నారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్ గారికి, నన్ను ఇంతటి ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన భారతమ్మ గారికి సదా కృతజ్ఞుడిని అంటూ ట్వీట్ చేశారు. జగన్ గారికి మంచి జరగాలని కోరుకుంటున్నానని వెల్లడించారు. "పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్ గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ/రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేశాను... కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశాను. దాదాపు 9 సంవత్సరాలు ప్రోత్సహించి... కొండంత బలాన్ని, మనోధైర్యాన్ని అందించి... తెలుగు రాష్ట్రాల్లో నాకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీ గారికి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారికి ప్రత్యేక ధన్యవాదాలు" అంటూ విజయసాయి పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీతో ఏపీలో భారీగా పెట్టుబడులు

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మీడియాతో మాట్లాడుతూ... ప్రతీ ఇంట్లో ఒక వ్యక్తి ఉద్యోగస్తుడై ఉండాలని నాడు చంద్రబాబు నాయుడు సంకల్పించారని అన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి చేసిన ఐటీ రంగంతో తెలుగు వారు ఉన్నత స్థానాల్లో ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. గ్రీన్ ఎనర్జీతో రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు, ఉద్యోగాలతో పాటు పొల్యూషన్ ఫ్రీ స్టేట్‌గా ఏపీ మారుతుందని తెలిపారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా మారి ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు తగ్గుతున్నాయి: మంత్రి సత్యకుమార్ యాదవ్

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు తగ్గుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారధి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ పాల్గొని మాట్లాడారు. అన్ని స్థాయిల్లో వ్యవస్థలో పద్ధతి ప్రకారం అన్ని పదవుల నిర్ణయం జరుగుతుందని చెప్పారు. అధికారంలో భాగస్వామ్యం ఉంది కనుక ప్రజల సమస్యలు తీర్చడంలో ముందున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. సూర్యఘర్ ద్వారా ప్రతీ ఇంటికి ఆదాయ వనరుగా మార్చే పనులు చేస్తున్నామని తెలిపారు. 2030 నాటికి 500 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. %ర్రా% మోడ్‌లో మెడికల్ కాలేజీలు తేవాల్సిన పరిస్థితికి గత వైసీపీ ప్రభుత్వమే కారణమన్నారు. నిధులు సరిగా ఇవ్వకుండా కాలేజీల నిర్మాణం జరగకపోవడానికి గత ప్రభుత్వం కారణమని ఆరోపించారు. సిద్ధార్థ మెడికల్ కాలేజీలో విద్యార్థినులకు హాస్టల్ లేదన్నారు. %ా%4 మోడల్‌లో మెడికల్ కాలేజీలు వచ్చిన దానికి తగిన ఫ్రీ సీట్లు ఉంటాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి ఏపీ ఆదుకోండి

-మొదటిపేజీ తరువాయి

పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యుడు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు తదితరులు ఉన్నారు.

ఆడపిల్లల భద్రత, శ్రేయస్సు మా లక్ష్యం

ఏపీలో ఆడపిల్లల భద్రత, శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని ఆడపిల్లలందరికీ ట్విటర్‌లో శుభాకాంక్షలు తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా ఆడపిల్లలు రేపటి మూలస్తంభాలుగా ప్రకాశించేలా చేస్తామని అన్నారు. ఆడబిడ్డలకు సమాన అవకాశాలు కల్పిస్తూ మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉండవల్లి చేరుకున్న సీఎం చంద్రబాబు... అందుబాటులో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దావోస్ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చారు. గత రాత్రి ఢిల్లీ వచ్చిన ఆయన ఇవాళ... కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ లను కలిశారు. ఈ సాయంత్రం ఢిల్లీ నుంచి బయల్దేరి ఉండవల్లి చేరుకున్నారు. ఆయనకు పార్టీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం, అందుబాటులో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలతో చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశం అయ్యారు. దావోస్ పర్యటన వివరాలను నేతలతో పంచుకున్నారు. తాము సమావేశమైన కంపెనీలు, ఆ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతున్న తీరును వివరించారు.

15 రోజుల్లో రాజధాని నిర్మాణానికి పనులు ప్రారంభం

-మొదటిపేజీ తరువాయి

అధికారులు, ఉద్యోగులు, జడ్జీల కోసం 2019కు ముందే మొత్తం 4053 అపార్ట్‌మెంట్ల పనులు ప్రారంభించాం. మాపై కక్షతో గత ప్రభుత్వం నిర్మాణాలను ఆపేసింది. అసెంబ్లీని 250 మీటర్ల ఎత్తులో నిర్మించి.. మిగిలిన రోజుల్లో టూరిజం స్పాట్‌గా మార్చాలని డిజైన్లు రూపొందించాం. రాష్ట్ర స్థాయి అధికారులందూ ఒకేచోట ఉండేలా 5 అడ్మినిస్ట్రేటివ్ టవర్‌లు డిజైన్ చేశాం. విద్యుత్ లైన్లు, డ్రైనేజీలు, తాగు నీటి పైపులు అండర్ గ్రౌండ్‌లో ఉండేలా డిజైన్ రూపొందించాం" అని మంత్రి నారాయణ తెలిపారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332